4.4.1997 శుక్రవారం 12 పేజీలు సంపుటి:69 సంచిక:14 ఏడ్రపతి రూ.2.00లు Phone: 27354 Regd. No. HNL 18

సమీక్షణము

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

నిర్మల వక్కపొడి
మ్యానుఫ్యాక్చరింగ్ కంపెని - నెల్లూరు, A.P.
1 రూపాయి P.T. వక్కపొడి రుచి చూడండి
Phones : STD : 0861 - 23795, 23796, 24796

రామోజీరావు కుట్ర నిజమైంది!

మద్యపాన నిషేధం రద్దు నిర్ణయంపై ప్రజలలో తలెత్తిన అలజడి, అందోళనలు ప్రచారానికి నోచుకోకుండా చేయడంలో ముఖ్య మంత్రి విజయం సాధించారు. రెండేళ్ల క్రితం మద్యపాన నిషేధ ఉద్యమాన్ని తన భుజాల మోది మోసిన ఈనాడు పత్రికాధిపతి, ఈటివి యజమాని శ్రీ రామోజీ రావు నోరు మూయించడంలోనూ చంద్రబాబు చాకచక్యం రుజువైంది. మద్య నిషేధం రద్దు చేసి వారం గడిచి పోయినా ; బ్రాంది అంగళ్లకు పెండర్లు పిల్చే కార్యక్రమం ప్రారంభమైనా ఈనాడు పత్రికలో ఒక్క వార్త రావడం లేదు; ఇదసలు వార్తర్హ విషయం కానట్లే ఎంచి, విస్మరిం చేస్తున్నారు. ఈ విషయంలో ఇతర పత్రికలను తప్పు పట్టడానికి లేదు; కాని 'ఈనాడు' మాత్రం మద్య నిషేధ ఉద్యమానికి వూపిరి పోసిన పత్రిక; దాదాపు ఏడాదికి పైగా ప్రతిరోజూ రెండు పేజీల నిండు అవే వార్తలతో జనాన్ని వూదర గొట్టారు. ఆనాటి ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు. సంపూర్ణ మద్య నిషేధం అమలులోకి వచ్చిన రోజు – అది తన వ్యక్తిగత విజయంగా అభివర్ణించు కున్నారు రామోజీరావు గారు. మద్య నిషేధం అనే ఆశయానికి తాము అంకితమని ప్రకటించు కున్నారు.

కానీ, ఇప్పుడంతటి మహోత్కృష్ట సామాజిక సంస్కరణకు చంద్రబాబు సర్కారు తూట్లు పొడిచేస్తే – మూగదాని వలె, గ్రుడ్డిదాని వలె

> చెరువు నీటికి కక్కుర్తిపడి మద్యపాన ఉద్యమాన్ని కాలరాస్తున్నారు!

వుండి పోతున్నది 'ఈనాడు' పత్రిక.

చెరువు నీటికి కక్కుర్తి పడి, స్నేహితుడి పదవికి ఎసరు వస్తుందని భయపడి, తన స్టూడియో వ్యాపారం పెంచుకోవాలని దురాశపడి చంద్రబాబుతో కలిసి ఈ దారుణమైన ప్రజావంచనకు పాల్పడ్డారు రామోజీ రావుగారు. బిస్కెట్ విసిరి కుక్కను మచ్చిక చేసుకున్నంత సులువుగా – ఆయన ఫిలిం స్టూడియో ప్రక్కనుండే అవాజ్‌పూర్ గ్రామంలోని 'ఇందిరమ్మ సాగర్' చెరువును దానం చేసి రామోజీ నోరు కట్టిపడేశాడు చంద్రబాబు. ఎందరో రాజకీయ వాదుల అవినీతి చరిత్రను అత్యంత పరుష పదజాలంతో నిందించి, నిలదీసిన రామోజీరావు గారు తన దాకావచ్చే సరికి లంచానికి దాసోహమనేశారు. ఆ ఫలానికి ప్రతిఫలంగా మద్య నిషేధం ఉద్యమ వార్తలను అణగద్రొక్కి ప్రభుత్వాన్ని పరిరక్షించ జూస్తున్నా రాయన. ప్రజలను వంచించిన ప్రభుత్వాధి నేతలను తన వ్యాఖ్యలతో ప్రశ్నించే కనీసపాటి విద్యుక్త ధర్మాన్నీ విస్మరించారు.

పత్రికా వ్యాపారం ప్రైవేటు వ్యవహార మనడం నిజమే; కాని దానికొక సామాజిక బాధ్యత కూడా వుంది. దాన్ని తృణీకరించే పత్రికలను తప్పు పట్టగల హక్కు ప్రజలకూ వుంది. పలురకాల వ్యాపార ప్రయోజనాలు కల్గిన పెట్టుబడి దారుల చేతుల్లో సమాచార సాధనాలు కేంద్రీ కృతమైతే ప్రజలకు జరిగే ప్రమాదానికి ఇదొక రుజువు. కోట్లు క్రుమ్మరించి, రంగులతో అలంకరించి, వూరూరా ప్రచురణ కేంద్రాలు పెట్టి, పత్రికా నిర్వహణ సామాన్యులకు అసాధ్యంగా తయారుచేసి, గుత్తాధిపత్యం పొందడం ద్వారా రామోజీరావు గారు ప్రభుత్వాలను తన గుప్పెట్లో పెట్టుకో గల్గుతున్నారు. బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేసి తన వ్యాపారాలు సాగించు కొంటున్నారు. ఈ కుట్రలో ఆయన పాతకులు బలి పశువులు. మద్య నిషేధం రద్దు చేయడం ద్వారా చంద్రబాబు ప్రజలకు చేసిన దగా కంటే – ఆ పంచనను పరోక్షంగా ప్రోత్సహించి, వ్యతిరేకతను కప్పి పెట్టడం ద్వారా రామోజీ రావు గారు చేసిన ద్రోహం మరింత దారుణమైనది. తనతో సరితూగ గల్గే కుబేరులు లేరు కాబట్టి తన తప్పులకు తన పత్రిక దెబ్బతిన కుండా కాపాడు కోవడం ఆయనకు చేతనవ వచ్చు; కాని ఒక్క క్షణం తన వైఖరిని ఆత్మ విమర్శ చేసుకొంటే రామోజీరావు గారు ఒక్క రాత్రి నిద్ర పోలేరు. ఎన్ని చెరువుల నీరు త్రాగినా – ఎన్ని కోట్లు

కొరవ 6 పేజీలో

బంజారా భూస్వాహా మేగోరె ఘనకార్యమే!

మొన్నటి అసెంబ్లీ సమావేశాలలో కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్‌కు దారితీసిన హైదరాబాదు, బంజారా హిల్స్ భూ కుంభకోణం సృష్టికర్తలు నెల్లూరీయులే! ఈ స్వాహాలో చంద్రబాబు నేరం ఎంత అన్న వివాదం పైనే అలజడి కేంద్రీకృతం కావడం వల్ల దాని కారకులైన వారు తెరమరుగై పోయారు.

దాదాపు 8 కోట్ల రూపాయల విలువైన భూస్వాహా ఇది. బంజారా హిల్స్ మూడవ నంబరు రోడ్డులో సీతాదేవి అనే మహిళకు 14 వేల చదరపు గజాల వరకు స్థలం వుండేది. అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత – అందులో 4100 గజాల స్థలం సీలింగ్ పరిమితికి మించి వుందని ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్నది. 1994లో జరిగి పోయింది వ్యవహారం. ఆ స్థలంలో మునిసిపల్ కమిషనర్ బంగళా కట్టాలని సైతం నిర్ణయం తీసుకున్నారు.

ఇప్పుడక్కడ చదరపు గజం ఇరవై వేల రూపాయలకు మించి పలుకు తుంది. నెల్లూరు రాజకీయ కురు వృద్ధుడు, శకుని మామ బిరుదాంకి తుండు శ్రీ మేనకూరు గోపాలకృష్ణా రెడ్డి కళ్లు ఎట్లనో దానిపై పడ్డాయి. తన కుమారుడి పేర దాన్ని కొనుగోలు చేసినట్లు సీతాదేవి వారసుల సహాయంతో ఒక పత్రం సృష్టించారు. మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సి. అర్జున రావు గారికి పూర్వాశ్రమంలో

> ఎనిమిది కోట్ల ఆరగింపుకు అర్జున రావును ఆటబొమ్మగా వాడుకున్నారు!

నెల్లూరులో కలెక్టర్‌గా వుండేటప్పుడు మేగోరెతో మంచి సాహచర్యం. అదిప్పుడు ఎంతో వుపకరించింది. పట్టించేవాడు మనవాడై నప్పుడు బంతిలో ఎక్కడ కూర్చున్నా ఒకటే కదా? సంతకం పెట్టాల్సిన వాడి తన చేతిలో కీలుబొమ్మ అయినప్పుడు ఏ ఫైలైనా సంకోచం దేనికి?

మేగోరె తన తెలివంతా వుపయోగ పెట్టి దీన్ని రెండు ఫైళ్లుగా విడగొట్టారు. ఆ స్థలం వుండే ప్రాంతాన్ని వాణిజ్య ప్రాంతంగా వర్గీకరించే ఫైలు మొదటిది; అందులో భవన సముదాయం కట్టడానికి ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్‌ను నిర్ణయించే ఫైలు రెండవది. రెండూ కాళ్లకు చక్రాలు తగిలించుకొని రయ్‌మని పరుగులు పెట్టాయి. ఎఫ్ఎస్ఐ ఫైలుపై – ఇది ప్రభుత్వ భూమి అని అర్బన్ ల్యాండ్ సీలింగ్ అధికారి వ్రాశాడు; ప్రక్కరోజే అతడికి బదలీ ఉత్తర్వు చేతికి అందింది. ఇదేదో గోల్మాల్ వ్యవహారంగా వుంది, ఫైలు ప్రక్కన పెట్టండి – అని, కమిషనర్ సుజాతా రావు ఆదేశించారు; ఆమెనూ ట్రాన్స్‌ఫర్ చేశారు. ఎవరెన్ని అభ్యంతరాలు చెప్పినా ఫైళ్ల గమనం ఆగలేదు; మంత్రికి, ముఖ్య మంత్రికి కూడా వెళ్లి సంతకాలు పూర్తి చేసుకొని వచ్చేశాయి. మధ్యలో – మంత్రి శ్రీ టి.

కొరవ 6 పేజీలో

నెల్లూరు ఉద్యమ వీరుల అడ్రస్ దొరకడం లేదు!

నెల్లూరులో మద్య నిషేధ ఉద్యమానికి నాయకత్వం వహించిన నేత లందరూ – ఇప్పుడు అదృశ్యమై పోయారు. ఒక్కరి అడ్రసూ దొరకడం లేదు. రెండేళ్ల క్రితం ఈ ఉద్యమం నెల్లూరు జిల్లాలో ఎంత తీవ్రంగా జరిగింది; దానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ఎటువంటి ప్రచారం లభించింది తెలిసిన సంగతే. ఊరేగింపులు, ధర్నాలు, మానవహారాలు, బంద్‌లు, అంగళ్ల దిగ్బంధనాలు, మద్య సీసాల దగ్ధాలు, నృత్య నాటికల ప్రదర్శనలు, డప్పు మోతలు, పాటల ఆలాపనలతో పల్లె పల్లె మార్మోగి పోయేట్లు చేశారప్పుడు. సారా వేలం కేంద్రాలపై దాడులు చేశారు. ఆనాటి ప్రభుత్వాన్ని అధికారంలో వున్న నాయకులను శాపనార్థాలు పెట్టారు. వీరావేశాలు ప్రదర్శించారు.

కాని ఆ ఉత్సాహం, ఉత్తేజం, ఉద్వేగం ఈనాడు ఎట్లా పోయాయో మరి – ఇప్పుడు ఒక్కరంటే ఒక్కరు కూడా కన్పడడం లేదు. జన విజ్ఞాన వేదికను తన బేబు సంస్థగా మార్చుకొని, మద్య నిషేధ పోరాట సమితి కన్వీనర్‌గా ప్రభుత్వ మర్యాదలన్నీ అందుకున్న డాక్టర్ విజయ కుమార్ – అసెంబ్లీలో మద్యం బిల్లు చర్చకు వచ్చే ముందు రోజు రాత్రే కలకత్తా రైలెక్కేశారు; మళ్లీ ఇటు తిరిగే చూడలేదు. నెల్లూరులో వుంటే మహిళలు నిలదీస్తారని భయపడి పారిపోయి నట్లున్నా రాయన. నెల్లూరుకు వచ్చినా – సిపిఎం పార్టీ ఆదేశం ధిక్కరించి ఉద్యమంలో పాలుపంచుకునే వ్యక్తిత్వ వైశాల్యం లేదు. మద్య నిషేధ ప్రచారం కోసం లక్షలకు లక్షలు ప్రభుత్వ నిధులను తేరగా తిన్న ప్రజానాట్య మండలి కనుమరుగై పోయింది. వారి కళాకారుల చిరునామాలు కనిపెట్టడం దుర్లభం.

> జన విజ్ఞాన వేదిక సిఎంకు అమ్ముడుపోయింది; ప్రథమ సేనాని విజయ కుమార్ వూరే వదలి వెళ్లిపోయాడు; డివైఎఫ్ఐ నేతలనూ పంపేశారు!

నెల్లూరులోనే వుండి, రద్దు ఉత్తర్వుకు వ్యతిరేకంగా ఒకటి రెండు ప్రదర్శనలు జరిపిన డివైఎఫ్ఐ నేతలను అరెంటుగా హైదరాబాద్ రైలెక్కించారు సిపిఎం పెద్దలు. వారిని తప్పు పట్టి ప్రయోజనం లేదు – ఈ యువకులు ఇక్కడ వుండి ఉద్యమంలో పాల్గొంటే – చంద్రబాబు తమ రాష్ట్ర పార్టీ నేతల తాట వలుస్తాడని భయపడి నట్లున్నారు.

కమ్యూనిస్ట్ పార్టీ ఎంత దిగజారి ముఖ్యమంత్రికి లొంగి పోయిందో తెలుసు కోవడానికి ఇదొక రుజువు. రాజకీయ

కొరవ 6 పేజీలో

సణుగుడు

* కలెక్టర్‌గారు పప్పులో కాలేస్తున్నారు.

డోలేంద్ర

బ్రాంది అంగళ్ల విషయంలో కలెక్టర్ డాక్టర్ సాంబశివ రావు గారు చాలా పట్టుదలగా వున్నారట - ఎట్లయినా ప్రతి అంగడినీ తెరిపించాలని! ఉద్యమ కారులపై కఠిన చర్యలు తీసుకుంటామని గట్టిగా చెప్పారట; సంబంధిత అధికారులకు అదే ప్రకారం ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

కలెక్టర్ అంటే ప్రభుత్వ ప్రతినిధి; సర్కారు ఆదేశాలు చిలక పలుకుల వలె ఉచ్ఛరించడం ఆయన విధి. అందు కాయన్ని తప్ప పట్టలేము. వ్యక్తిగతంగా సాంబశివ రావుగారు చాలా శాంత స్వభావి; స్నేహపాత్రుడు; కలెక్టర్ వంటి ఉన్నత పదవిలో వున్నానన్న భేషజం. గీర ఆయనలో కన్పించవు. అందువల్లే అతి సామాన్యుడు సైతం కలెక్టర్ దగ్గరకు స్వేచ్ఛగా వెళ్ల గల్గుతున్నాడు; ఆదరణ పొందుతున్నాడు.

అయితే రెండేళ్లలో ఎంత మార్పు? అప్పుడిదే కుర్చీలో వుండిన కలెక్టర్ - మద్య ఉద్యమ కారులకు పెద్ద అండగా వుండినారు. ఎక్కడ ఏ విషయంలో ఎక్సైజ్ సిబ్బందితోనో, పోలీసులతోనో పేచీ వచ్చినా అర్ధరాత్రి పూట కూడా కార్యకర్తలు కలెక్టర్ ఇంటి తలుపు తట్టేవారు; రక్షణ పొందేవారు. అప్పటి సాంబశివ రావుగారూ అంతే, అంతకు మునుపుండిన రాజుగారూ అంతే! అసలు .మద్య నిషేధం ఒక ఉద్యమంగా రూపాంతరం చెందడానికి కారకులు, ప్రేరకులు కలెక్టర్ రాజుగారే! దూబగుంట రోశమ్మలు, చెనిగుంట

కొరవ 6 పేజీలో

కేసరి అత్యాశకు ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం!

షేర్‌కాలం

డాక్టర్ ఎ. దుర్గాప్రసాద్

సీతారాం కేసరి సృష్టించిన రాజకీయ సంక్షోభం వల్ల, దేశ ఆర్థిక వ్యవస్థ సైతం సంక్షోభంలో పడిపోయింది. షేర్ మార్కెట్‌పై దీని ప్రభావం చెప్పనలివి కానటు వంటిది. నేషనల్ స్టాక్ ఎక్ఛేంజిలోనే కొన్ని వేల కోట్ల రూపాయల నష్టం వచ్చింది. స్టాక్ మార్కెట్ పరిస్థితులు అధ్వాన్నంగా తయారైనాయి. స్టేట్ బ్యాంక్, రిలయన్స్ వంటి కీలకమైన షేర్లను సైతం కొనేవారు లేరు. తమ దగ్గరుండే ప్రతి షేరునూ అమ్ముకొని బయట పడాలని భావించేవారు లక్షల సంఖ్యలో వున్నారు; కొనుగోలు దారులు మార్కెట్ నుంచి అదృశ్యమై పోయారు.

కేంద్రంలో రాజకీయ సంక్షోభం వల్ల షేర్ మార్కెట్‌కు జరిగే నష్టం కంటే - మొత్తం ఆర్థిక వ్యవస్థకు జరిగే ప్రమాదం తీవ్రమైనది. అది చిన్నా భిన్నమయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. దేవగౌడ ప్రభుత్వం తమ మద్దతు లేనిదే బతకదని సీతారాం కేసరికి ఎప్పటి నుంచో తెలుసు; బడ్జెట్ ప్రతిపాదించే సమయంలోనే ఆయన దేవగౌడను దించేసి వుంటే పరిస్థితి నేరుగా వుండేది. బడ్జెట్ ప్రవేశ పెట్టేటప్పుడు చూస్తుండి పోయారు; ఆ తర్వాతే దాన్ని సమర్థించారు; ఇప్పుడు ప్లేటు ఫిరాయించారు. బడ్జెట్ ఆమోదం కాకుంటే ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమై పోతుంది; పరిపాలన తీన్తారే తుంది. రేపు 11 తేది పార్లమెంటులో చర్చకు వస్తున్న విశ్వాస తీర్మానం వీగిపోయి ప్రభుత్వం పడిపోతే ఈ బడ్జెట్ చెల్లదు. ఎన్నికలు ప్రకటించినా అదే పరిస్థితి. మన రాజకీయ వాదులు దేశ హితం కోరే వారైతే - విశ్వాస తీర్మానం కంటే ముందు బడ్జెట్ ఆమోదం జరిపించాలి. కాంగ్రెస్, బిజెపిలతో సహా అన్ని పార్టీలూ అందుకు సహకరించాలి.

***

షేర్ల ధరల పతనం వల్ల, రాజకీయ అస్థిరత్వం వల్ల విదేశీయులు చేసే ప్రత్యక్ష పెట్టుబడులు క్షీణిస్తాయి. వారిలో విశ్వాసం సన్నగిల్లు తున్నది. ఈ ఏడాది కనీసం పది బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం పెట్టుబడుల రూపంలో తరలి వస్తుందని చిదంబరం ఆశ పర్తుండినాడు. అది ఇంక

కొరవ 6 పేజీలో

అరాచకం, అస్తవ్యస్తత, ఆర్థిక బాధలు, రక్తపాతం... ఇవీ ఈ ఉగాది ఇవ్వబోయే వరాలు

దేశంలో, రాష్ట్రంలో నాయకత్వ మార్పు సంభవం!

ఈశ్వర సంవత్సరం ప్రభవాది 60 సంవత్సరాలలో 11వది. చాంద్రమానం ప్రకారం చైత్రశుక్ల పాడ్యమి మంగళవారం 8.4.97 తేది నుండి మనకు ఈశ్వర సంవత్సరం. తిరుపతికి దక్షిణ భాగమంతా సౌరమానం పాటిస్తారు. వారికి 13.4.97 నుండి ఈశ్వర సంవత్సరం. వింధ్య పర్వతాలకు ఉత్తరాన బార్హస్పత్యమానం. ఆషాడ బహుళ పంచమి బుధవారం 9.7.97 నుండి వారికి విశ్వావసు సంవత్సరం. కాని దేశంలో ఎక్కువ మంది చాంద్రమానాన్ని పాటిస్తారు.

సంవత్సర ఫలం

మనకు సంవత్సర ప్రారంభం మంగళ వారమైంది కనుక ఈ సంవత్సరాధిపతి కుజుడు. నవనాయకులలో మిగిలిన వారందరూ ఒక్కొక్కరాశి సూర్య సంక్రమణ సమయాలు గల వారాలను బట్టి నిర్ణయింప బడతారు. ఈ సంవత్సరం రాజు కుజుడు; మంత్రి, సేనాధిపతి, అర్ఘాధిపతి, మేఘాధిపతి సూర్యుడు; సస్యాధిపతి, నీరసాధిపతి బుధుడు; ధాన్యాధిపతి కుజుడు; రసాధిపతి శుక్రుడు. వీరిలో 6 మంది క్రూరులు. ముగ్గురు శుభులు. దీనిని బట్టి చూస్తే ప్రజాపాలన క్రూరంగా ఉంటుంది. మాటలు ఆశలు గొలుపుతాయేగాని ఫలితా లుండవు. స్వార్థం ఎక్కువగా ఉంటుంది. ఉత్తర రాష్ట్రాలలో అరాచకం, దుర్భిక్షాలు; పశ్చిమ దిక్కున గల రాష్ట్రాలలో విరోధాలు, అస్తవ్యస్త పాలన; తూర్పు ఈశాన్య రాష్ట్రాలలో పనరులు బాగుండినా రక్తపాతా లుంటాయి. దక్షిణ రాష్ట్రాలలో వ్యాధులు ప్రజానష్టం, భూకంపాలు, హత్యాకాండ జరుగుతాయి.

నవనాయక ఫలితాలు

1. రాజు కుజుడు: 8.4.97 మంగళవారం చైత్ర శుక్ల పాడ్యమి.

రాజకీయ స్థితి అనిశ్చితంగా ఉంటుంది. ప్రజావైషమ్యాలు, అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి.

2. మంత్రి రవి: 13.4.97 మేష ప్రవేశం.

దేశంలో ప్రభుత్వాలు మారటం. ప్రజలలో సత్కర్మ భావాలు పెరగడం ప్రభుత్వ నేతల మధ్య విరోధాలు, కొనసాగుతాయి.

3. సేనాధిపతి: 17.8.97 సింహప్రవేశం.

అధికారంపై అంతర్యుద్ధాలు, వాయువుతో కూడిన వర్షాలుంటాయి. ఎర్ర నేలలు బాగా ఫలిస్తాయి, సైనిక పాటవం బాగుంటుంది.

4. సస్యాధిపతి బుధుడు: 16.7.97 తేది కర్కాటక రాశి ప్రవేశం.

వర్షాధిక్యత, సకాలంలో వర్షాలు పడడం, గాలి వానలు ఉంటాయి. ప్రజలలో కుత్సిత బుద్ధులు, భీతి ఎక్కువగా వుంటాయి.

5. ధాన్యాధిపతి కుజ: 16.12.97 తేది ధనుః ప్రవేశం.

సన్న ధాన్యాలు, ఎర్ర ధాన్యాల ఉత్పత్తి పెరుగుతాయి. ఎర్రరేగడి నేలలు ఫలిస్తాయి. ధరల పెరుగుదల ధాన్య విషయంలో ఎక్కువగా ఉంటుంది.

6. అర్ఘాధిపతి రవి: 15.6.97 తేది మిథున ప్రవేశం.

కెమికల్స్, రత్నాలు, ఎరధాన్యాల ధరలలో పెరుగుదల చాలా స్వల్పం. గృహనిర్మాణ ఉపకరణాలు, గృహాలంకరణ సామగ్రి, వస్త్రాలు, ఆహార ధాన్యాలు, నూనెల ధరలు బాగా పెరుగుతాయి. రవాణా ఛార్జీలు పెరుగుతాయి.

7. మేఘాధిపతి రవి: 22.6.97 తేది ఆర్ద్ర కార్తె ప్రవేశ వారం.

వర్షం దేశమంతటా ఖండఖండాలుగా కురుస్తుంది. భూకంపాలు, వర్షాల వల్ల జననష్టం జరుగుతాయి. అయితే చాలినంతగా వర్షాలుంటాయి.

8. రసాధిపతి శుక్ర: 11.10.97 తేది తులా ప్రవేశం.

సుగంధ వస్తువులు, రస వస్తువులు, క్షార వస్తువులు, గడ్డలు దుంపకూరలు, ఫలాలు బాగుగా పండి లభించినా ధరల పెరుగుదల మాత్రం తప్పదు.

9. నీరసాధిపతి బుధుడు: 14.1.97 తేది మకర ప్రవేశం.

పచ్చమణులు, పెసలు వంటి పచ్చ ధాన్యాలు, పసుపు వస్తువులు పుష్కలంగా లభిస్తాయి.

తక్కువ. రాజకీయ రంగాన, వ్యాపార రంగాన మార్పులుంటాయి. రాష్ట్ర ప్రభుత్వాల మార్పు, రాష్ట్ర నాయకత్వ మార్పు, దేశ నాయకత్వాన మరొక మార్పు జరుగును. పంచమాన గురువుండుట వల్ల హిందూ ధర్మరక్షణ, ఆస్తికత్వం కొనసాగును. భూముల ఆక్రమణ, పురుషాధిక్యత తగ్గుట, విమాన, వాహన ప్రమాదాలుంటాయి. లగ్నాధిపతి బుధుడు అష్టమాన ఉండడం వల్ల ప్రముఖులు నలుగురి వియోగం, దక్షిణ రాష్ట్రాలందు ప్రభుత్వ నేతల మార్పు, తుఫాన్ వల్ల ఆంధ్ర, తమిళులకు బాధలుంటాయి..

జగల్లగ్నం ధనుస్సు. గురువు ద్వితీయాన, రవి, బుధ, శుక్రులు పంచమాన; శని, కేతువులు చతుర్థాన ఉండడం వల్ల వ్యాపార వృద్ధి గతం కంటే తగ్గుతుంది. ఋణభారం పెరుగుట, ఇతర దేశ పెట్టుబడులు పెరుగుట, ప్రభుత్వ మార్పులుండును. భాగ్యాన కుజుడు ఉండడం వల్ల భూములు మంచి పంటల నిచ్చును. చీడలచే, జలంచే కొంత సస్య నష్టం, పశునష్టం కలుగును. పగటి పూట కార్తె ప్రవేశించడం వల్ల వర్షాధిక్యం (ఎక్కువ వర్షం) వున్ననూ పంటల నష్టం కూడా ఉంటుంది.

మకర సంక్రాంతి

14.1.98 తేది బుధవారం పగలు 3.00 గం.లకు మకరరాశికి రవి ప్రవేశం. ఇది ఉత్తరాయణ పుణ్యకాలం. ఈ సమయాన గల తిథి, వార, నక్షత్ర ఫలాలు గమనించితే దక్షిణ దేశాన అధికార మార్పులు, సువృష్టి, పంటల రాబడి పెరుగుట, క్రొత్త రోగాల వల్ల బాధ, జన నష్టం, శాస్త్రవేత్తల వియోగం కలుగుతాయి. దొంగ తనాలు, దోపిడీలు ఎక్కువగా వుండును.

సింధూనదీ పుష్కరాలు

8.1.98 తేది గురువారం గురువు కుంభరాశిలో ప్రవేశించడం వల్ల సింధూనదీ పుష్కరాలు ప్రారంభమవుతాయి.

మౌఢ్య నిర్ణయం

28.4.97 సోమవారం వ్రతకు శుక్ర మౌఢ్యమి. మరల 12.1.98 నుండి 20.1.98 వరకు శుక్ర మౌఢ్యమి. 13.2.98 నుండి 20.1.98 వరకు గురు మౌఢ్యమి. ఈ మౌఢ్యాలలో శుభ కార్యాలు చేయరాదు.

చంద్ర గ్రహణం

16.9.97 మంగళవారం రాత్రి 10.30 గం.ల నుండి 1.40 గం.ల వరకు కేతుగ్రస్త చంద్ర గ్రహణం. ఈశాన్య స్పర్శ వాయువ్య దిక్కు నుండి విడుదల

మొత్తం మీద రాజకీయ పరిస్థితులు సవ్యంగా లేవు. ప్రజాక్షేమం కూడా దోషంగానే వుంది.

ఉగాది పంచాంగం ★ ★ ★ స్వయంపాకుల శ్రీనివాసులు, ఎం.ఎ.

వర్షలగ్న - జగల్లగ్న ఫలితాలు

సంవత్సర ప్రారంభాన పాడ్యమి తిథి ప్రారంభసమయ లగ్నం వర్షలగ్నం; సూర్యుడు మేషరాశి ప్రవేశ సమయ లగ్నం జగల్లగ్నమని చెబుతారు. ఈ సంవత్సరంలో వర్షలగ్నం కన్యాలగ్నం. లగ్నంలో రాహువు, సప్తమాన పంచగ్రహ కూటమి వల్ల, పంచమాన గురువు, సింహరాశిలో కుజుడు, బుధుడు అష్టమం. దీనివల్ల దేశంలో ఈ సంవత్సరంలో ప్రభుత్వాలకు స్థిరత్వం లగ్నాన్ని చంద్రుడు చూడడం, వల్ల న్యాయ రక్షణ ప్రజలకు బాగుండును. రాహువు దశమ కేంద్రాన ఉండడం వల్ల రాజకీయ అస్థిరత ఈ సంవత్సరం దేశంలో ఎక్కువ. ప్రజలలో దైవభక్తికి, దేశ క్షేమానికి లోటుండదు. ఇరుగుపొరుగు దేశాలలో సమస్యలు సద్దు మణుగుతాయి.

ఆర్ద్రకార్తె ప్రవేశం

22.6.97 తేది ఆదివారం ఉదయం 8.45 గం.లకు ఆర్ద్ర నక్షత్రాన రవి ప్రవేశిస్తాడు. దీని ఫలితం

ఏ పాపానికీ శాపం?

తలలు బోడులైనా, తలపులు బోడులేనా అన్నారు పెద్దలు. కాటికి కాలు చాపివున్న సీతారాం కేసరి ప్రధానిత్వం కోసం కలలు కనడం ఈ కోవకు చెందిన చాపల్యమే! కాంగ్రెస్ అధ్యక్షుడ్ని నించు కొన్నాను – ఆ ముచ్చటా తీర్చుకొంటే జన్మసార్థక మౌతుందని ఉబలాట పడి, వుట్టి పుణ్యానికి దేవగౌడ ప్రభుత్వాన్ని సంక్షోభంలో పెట్టేశాడు. అంత కంటె వేరే కారణమేదీ కన్పించడం లేదు – ఈ దుర్మార్గ నిర్ణయానికి! దేవగౌడ మతతత్వ శక్తులతో చేతులు కల్పుతున్నాడని, శాంతి భద్రతల పరిస్థితి అదుపు తప్పిందని హోం మంత్రి ఇంద్రజిత్ గుప్తాయే ప్రకటించాడని; అందు వల్లే మా మద్దతు వుపసంహరిస్తున్నామని; కేసరి చెప్పినవన్నీ కుంటిసాకులే!

కాంగ్రెస్‌కి వుండేది కేవలం 143 మంది ఎమ్పీలు. వారితో ప్రభుత్వం ఏర్పాటు చేయలేరు. 544 మంది సభ్యులున్న పార్లమెంట్‌లో సింపుల్ మెజారిటీ కావాలన్నా కనీసం 272 మంది కావాలి. అంటే కాంగ్రెస్‌కు తక్కువడే సంఖ్య 129. బిజెపి మినహా మరే పార్టీకి అంత మంది లేరు. సిపిఎం, సిపిఐలు కాంగ్రెస్‌ను సమర్థించారు. తెలుగు దేశం, ఎజిపి వంటి పార్టీలూ కాంగ్రెస్ వ్యతిరేకతే తమ విధానంగా కల్గినవి. టిఎంసి, డిఎంకె కలిసి వచ్చినా చాలరు. ఎట్లా లెక్కవేసినా, ఎన్ని కూడికలు, తీసివేతలు చేసినా కాంగ్రెస్‌కు అధికార యోగం సిద్ధించదు. అయినా ఏదో ఆశ, దుస్సహమైన దురాశ ఆవహించింది సీతారాం కేసరిని. కనీసం తన పార్టీలోని ఇతర నాయకులతోనూ మాట మాత్రం చెప్పకుండా రాష్ట్రపతికి లేఖ సమర్పించేశారు.

దేవగౌడ సమకాలీన రాజకీయాలకు సరిపోయే వ్యక్తి. అందితే జుట్టు, అందకుంటే కాళ్లు పట్టడం తప్ప – ఆత్మాభిమానం కోసం పదవులు వదలుకొనే సత్తెకాలపు దాదస్తం ఆయనలో లేదు. ఛీపో అన్నా చూరుపట్టుకు వ్రేలాడటం ఆయన నైజం. అందువల్లే తనకు బలం లేదని తెలిసీ కుర్చీ వదలకుండా, అతుక్కొని వుండి పోయాడు. ఒక్కరోజు అదనంగా వుంట గల్గినా చాలనే ధోరణితో – రాష్ట్రపతిని ప్రాధేయపడి 11 తేది వరకు గడువు పొడిగించు కున్నాడు. ఫలితం – రాజకీయ సంక్షోభం!

దేశం ఇప్పుడున్న పరిస్థితులలో ఇది ఎంత ఘోరమైన దుర్గతో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సంకుచిత, స్వార్థ తలపులే తప్ప దేశహితం పట్ల ఏ మాత్రం లక్ష్యం లేని నీచ మనస్కులు నేతలుగా మన నెత్తిన స్వారీ చేయడం కంటె ప్రారబ్ధం వేరేదీ వుండదు. వుంటుందో వూడుతుందో తెలియని అస్తు బిస్తు ప్రభుత్వం; రేపేమౌతుందో తెలియని అయోమయం దేశంలో అరాచకత్వాన్ని ప్రేరేపిస్తాయి. ఇప్పటికే బీహార్‌లో, యుపిలో ఏమి జరుగు తున్నదీ చూస్తున్నాం మనం. వెయ్యి కోట్ల విలువైన పచ్చగడ్డిని తిని, నెమరు వేస్తున్న లల్లూప్రసాద్ యాదవ్‌ను ఏ చట్టమూ, ఏ కోర్టూ ఏమీ చేయలే కున్నాయి. రైళ్ల దోపిడీలో ఆయన హస్తం వుందని తెలిసీ చూస్తూ వుండి పోతున్నారు. ఇంతటి అరాచక వాతావరణంలో కేంద్రం బలహీనం కావడం సంఘ విద్రోహులకు మాత్రమే సంతోషం!

సీతారాం కేసరి చేసిన తప్పుకు ఏ శిక్ష విధించినా తక్కువే. తన ఒక్కడి అధికార తాపత్రయం కోసం 80 కోట్ల మంది భద్రతతో ఆటలాడు తున్నారాయన. ఆయనెంత గింజుకున్నా ప్రధాని కావడం అసాధ్యం. మరీ దిగజారి బిజెపితో చేతులు కల్పితేనే అది సాధ్యం. కాని దేవగౌడ ఇప్పటికే బిజెపితో ఒక ఒప్పందానికి వచ్చేశాడట – తన తపదవి నిల్పితే, కాంగ్రెస్‌ను చీలుస్తానని! అదే జరిగితే ఇప్పటికే నామ మాత్ర వశిష్టంగా వున్న కాంగ్రెస్ మరింత శిథిలమై పోతుంది. పివి నరసింహా రావుగారు తన స్వార్థం కోసం పార్టీని భూస్థాపితం చేసి వెళ్లారు; ఇప్పుడు సీతారాం కేసరి దానికి శ్రార్థ కర్మలు నిర్వహించ బోతున్నారు.

కనీసం మధ్యంతర ఎన్నికలకు వీలుండివా పరిస్థితి ఇంత హీనమయ్యేది కాదు. కాని, పదినెలలలో ప్రజల ముందుకు వెళ్లడానికి ఏ పార్టీ నేత సిద్ధంగా లేడు. ఒక్క ఎమ్పీ కూడా అందుకు సరేననడు. అందువల్ల ఢిల్లీ ప్రభుత్వంతో నేతల మ్యూజికల్ ఛేర్స్ ఆట ప్రారంభం కాబోతూందిప్పుడు. ఏ రోజు ఎవరికి ఏ రీతిలో కుర్చీ దొరికితే, వారు దాన్ని అక్కున చేర్చుకోవడం; ప్రక్క క్షణంలోనే వారి కాళ్ల క్రిందకు నీళ్లు రావడం చూడబోతున్నాం మనం!

ఏ పాపం చేశారని భారతీయులకు ఈ శాపం?

జమీన్‌రైతు

4.4.47

పేజీలు:8 వెల:0-1-6

జమీందారీలు రద్దు; శాసనం రాబోతున్నది

జమీందారీలను రద్దు పరచటం - ఎస్టేట్లను వెంటనే ప్రభుత్వం స్వాధీన పెట్టుకొనుట - దాని పరిపాలనకు అవసరమగు, రైతులకు అనుకూలములగు సవరణలతో ఎస్టేట్స్ లాండ్ రెవిన్యూ బిల్లు - యివి రాగలవు.

-వెల్లూరు వెంకట్రామా నాయుడు

భగత్‌సింగ్

భగత్‌సింగ్ జిందాబాద్ అని దేశం తిరిగి స్మరణ జేస్తున్నది. మనం పీడు పోపలిష్టు యుగంలో ప్రవేశించి యున్నాము. ఈ యుగ సంధిని ముందు గుర్తించినవాడు భగత్‌సింగ్. హిందూస్తాన్ రిపబ్లికన్ ఆర్మీని, హిందూస్తాన్ సోపలిష్ట రిపబ్లికన్ ఆర్మీగా నిర్మాణం చేసి నవ యువక లోకంలో రౌద్రమే కాక సామాజిక దృష్టిని కూడా భగత్‌సింగ్ కలుగజేశాడు.

అసెంబ్లీలో బాంబు వేయడం దేశంలో తప పార్టీ ఉనికిని సైమన్ కమీషన్ ద్వారా లోకానికి వెల్లడి కావలెనని చేశాడు.

భగత్‌సింగ్ భారత దేశపు - అలెగ్జాండరు. ఇంచు మించుగా దత్, కపూర్, సింహా, తివారి తదితరులు జైళ్లలో యువకులకు తత్త్వం ప్రబోధించిన ఫలితంగా కొన్ని కుట్రకేసులు జరిగినవి. కాని తదనంతరం అచిరకాలంలో వ్యక్తిగత హింసా ఉద్యమం పోయింది. దానిస్థానే తీవ్రతర ప్రజా ఉద్యమం విప్లవ నివాదంతో లేచి, ఆగస్టు ఉద్యమంలో హిందూస్తాన్ రెడ్డార్మీ వరకు, ఇటీవల పోలీసుల తిరుగుబాటు వరకు వచ్చింది. రష్యాలో బోల్షివిక్ ఉద్యమాన్ని నడిపించిన అలెగ్జాండర్ లెనిన్ అన్న, అతడే రష్యాలో కడపటి వ్యక్తిగత హింసావాది.

50 ఏళ్ళ క్రితం ఈ వారం

బార్టి బెర్నార్డ్‌షా

ఆంగ్ల రుషి బార్టి బెర్నార్డ్ షా 90 ఏళ్ల నవ యువకుడుగా ఇంగ్లాండులో ఒక కుగ్రామంలో కాలం గడుపు తున్నాడని తెలిసింది. 'ఎందుకీ పల్లెలో చిరినావయ్యా' అని అడిగితే, "ఇక్కడ 70 ఏళ్ల బ్రతికితే ఒక లెక్కలోది కాదు" అని ప్రపంచ ప్రసిద్ధ రచయిత జవాబిచ్చాడట.

తయన రాసిన ఉత్తరం నీ దగ్గర ఏదైనా ఉంటే దానిని సులభంగా సొమ్ము చేసుకోవచ్చు. ఆంగ్లజాతి, ఆంగ్ల లోకం తయన చిత తిట్టించుకొని ఆ[illegible]

కొరవ 8 పేజీలో

ప్రజలను దగా చేశారు!

నెల్లూరు జిల్లా మహిళలు అనేక త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకొన్న మద్యపానంపై నిషేధం ఎత్తి వేయడం దారుణం. మద్య నిషేధాన్ని అడ్డం పెట్టుకొని అధిక శాతం అసెంబ్లీ సీట్లను సాధించిన తెలుగు దేశం నేతలు ప్రజలను మోసం చేశారు. ఎమ్మెల్యేల సంఖ్యా బలంతో ప్రభుత్వం కనీస చర్చ కూడా లేకుండానే బిల్లుపై ఆమోద ముద్ర వేయడం క్షంతవ్యం కాదు.

నెల్లూరు షేక్. మొహిద్దీన్

రైతుల ప్రాణంతీస్తున్న పురుగు మందులు!

పురుగు మందులు, పంట నాశించిన తెగుళ్ల పని పట్టలేక పోయినా రైతుల ప్రాణం మాత్రం తీస్తున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ కోతవల్ల నేటి దగ్గర కొచ్చిన పంట ఎండిపోయి, మరో గత్యంతరం లేక తెలంగాణాలోఒకరైతు పురుగుమందు త్రాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. బ్యాంకులోను కోసం కాళ్లు అరిగేలా తిరిగి విసిగి వేసారిన మరో రైతు బ్యాంకు ముందే పురుగుల మందు త్రాగి ప్రాణం తీసుకొన్నాడు. బ్రతుకు తెరువు కోసం హైదరాబాద్ నగరం చేరి అక్కడ బ్రతకలేక మరో కుటుంబం యావత్తు పురుగు మందు త్రాగి ప్రాణాలు పోగొట్టుకొన్నది. రైతులకు, సామాన్యులకు ఆత్మహత్యలే శరణ్యమైనప్పుడు ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? తన ప్రభుత్వం పలు విషయాల్లో ఫస్టు ప్లేసులో వుందని చెబుతున్న చంద్రబాబుకు ఈ విషయంలో సిగ్గు కల్గడం లేదా?

గంగవరం జి. రామకృష్ణప్రసాద్

కమ్యూనిస్టులను ఆడిపోసుకొన్నారు

25 తేది జమీన్‌రైతు సంచికలో సిపిఐ పార్టీ నెల్లూరులో జరిపిన రాష్ట్ర రైతు సదస్సుకు సంబంధించిన వార్త - వ్యాఖ్య చదివాక గట్టి సమాధానం ఇవ్వాలను కొన్నాను. పునరాలోచించాక ఆ భావన మార్చుకొన్నాను. విమర్శతో ఆత్మ విమర్శ చేసుకొని పరిస్థితిని సరిదిద్దు కోవాలని భావించాను. జమీన్‌రైతుకు ఆది నుంచీ కమ్యూనిస్టులను ఊరకనే ఆడిపోసుకొనే అలవాటుంది. అది మాన్పుకోలేరా?

కోవూరు కె. చంద్రమోహన్‌రెడ్డి

సణుగుడు కాదు - నరుకుడు!

జమీన్‌రైతు ప్రతి వారం చూస్తూనే వున్నాను. ఈ మధ్య మరింత ఆకర్షణీయంగా ఉంది. సణుగుడు శీర్షికను నరుకుడు శీర్షికగా పేర్కొనడం బాగుంటుంది. ఇంతకు మునుపు స్వర్గీయ శ్రీరామమూర్తి గారు మెత్తగా, నొప్పి తగల కుండా శస్త్ర చికిత్స (విమర్శ) చేసేవారు. ఇప్పటి సణుగుడులో 'ఖైమా' పాళ్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ మధ్య ఆనం సంజీవరెడ్డి, యానాదిరెడ్డి ఈ నరుకుడు బాధితులు. కావలి ఎమ్మెల్యే -మద్యం బిల్లు వంటి ముఖ్య సమయాల్లో కూడా అసెంబ్లీలో లేకుండా పోయారు. జమీన్‌రైతు కలంపోట్లకు గురికాని నాయకుడు నెల్లూరుజిల్లాలో

కొరవ 8 పేజీలో

జనవాణి

స్థలం అమ్మబడును

నాకు హక్కు, అనుభవంలో నున్న 7 ఎకరాల 28 సెంట్లు భూమి అమ్మబడును. ఇది ఏ.సి. నగరు శ్రీ వేణుగోపాల స్వామి కాలేజి వారి నూతన భవన సముదాయంకు సమీపంలో వున్నది. వివరాలకు

యం. వినోద్

లక్ష్మీపురం, నెల్లూరు

ఫోన్లు: 29152 (ఇల్లు); 26771 (SBI Bank)



2 తేది బంద్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను నిలిపి నిరసన తెల్పుతున్న యువ నాయకద్వయం – సునీల్ కుమార్ రెడ్డి, దేవకుమార్ రెడ్డి.

మొల్ల జయంతి మొక్కుబడి తంతేనా?

29 తేది సాహిత్య సదస్సు యాజమాన్యాన టౌన్‌హాల్‌లో మొల్ల జయంతి చప్పగా జరిగింది. "మొల్ల కవితా వైభవం" ప్రాసంగీకురాలైన ధి.కె.దమ్మ్యూ కళాశాల ప్రిన్సిపల్ కె. సుశీలాంబ మొల్ల పద్యాలకు ప్రతిపదార్థ తాత్పర్యం చక్కగా చెప్పి, సభను లెస్సగా మెప్పించారు.

సభారంభంలో తటాలున కోలాహలం బయలు దేరింది. తీరా చూస్తే - ఎతక్కళాశాల మహిళా లెక్చరర్లు తలకొక్కమాల చొప్పున తమ ప్రిన్సిపల్ గారికి సమర్పించిన పూమాల సేవ - ఫోటో దిగటం - నా ప్రక్కనున్నాయన మొల్ల జయంతిలో కాలేజీ వార్షికోత్సవమా? అని సరిప్రశ్న.

సభకు జె.వి.రెడ్డి గారు అధ్యక్షునిగా గోసుకొండ వెంకటసుబ్బయ్య గారు కార్యదర్శి నివేదికను చదివి, కోటీశ్వరు లందరూ కడకు మోక్ష సామ్రాజ్యంలో కొలువు తీరుతారని గ్యారంటీ ఇచ్చేశారు.

రానురానూ సాహిత్య సభలు చప్పగా తయారు కావడం ఆలోచించ దగిన విషయం. ఏదిఎట్లున్నా యీటికి "సాహిత్య సదస్యులు" మొల్ల మొక్కుబడి చెల్లించుకొని ధన్యులైనారు.

కుటుంబ నియంత్రణ లక్కీడిప్ విజేతలు!

జిల్లాలో ఫిబ్రవరి 17 తేది చేపట్టిన ప్రత్యేక కుటుంబ నియంత్రణ కార్యక్రమం అనుకొన్నంతగా విజయవంతం కాలేదు. అందువల్లే ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 15 తేది వరకు పొడిగించారు. మార్చి 31 తేది వరకు ఈ ఆపరేషన్లు చేయించుకున్న వారి పేర్లను లక్కీడిప్ తీశారు. ఈ సందర్భంగా 1 తేది కస్తూరిబా కళాక్షేత్రంలో సభ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, దేశ ప్రగతి పట్ల ప్రజలు నిజమైన స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా అడిషనల్ జడ్జి చంద్రకుమార్ మాట్లాడుతూ ఒక వ్యక్తి సర్వతో ముఖాభివృద్ధి సాధించాలంటే పరిమిత కుటుంబం ఎంతో అవసరమన్నారు. లక్కీడిప్ డ్రాలో లక్షరూపాయలను బుచ్చి మండలానికి చెందిన పద్మ, 25 వేలు తురిమెర్లకు చెందిన రేకుల రమణమ్మ పొందారు. ఈ లక్కీడిప్ సభలో బాలాజీగ్రూప్ ఛీఫ్ ఎగిక్యూటివ్ పివి. ప్రసన్నకుమార్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఎస్పీ పూర్ణచంద్రరావు, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయానంద్, ఎస్.సి. కార్పొరేషన్ ఇ.డి. వెంకట్రామారెడ్డి, వైద్య ఆరోగ్యశాఖాధికారి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మునిసిపల్ వైస్ ఛేర్మన్‌తో కౌన్సిలర్ల చెడుగుడాట!

మునిసిపల్ వైస్ ఛేర్మన్ శ్రీ వేలూరు దశరథరామయ్యకు ఎప్పుడోకాని కౌన్సిల్ సమావేశం అధ్యక్షించి ఛాన్సు రాదు; బహుశా శివరాత్రినాడు అది వచ్చినా - ఆ సమావేశం ఏకగ్రీవంగా జరగదు. మొన్న 30 తేది జరిగిన కౌన్సిల్ మీటింగ్‌లోనూ సిపిఎం, కాంగ్రెస్ సభ్యులు ఆయనతో చెడుగుడు ఆడుకొన్నారు. సభ్యులను సమాధాన పరచలేక సతమతమై పోయారాయన. సిపిఎం సభ్యులు పట్టువదలని విక్రమార్కుల్లా విజయ్ మహల్ బాక్సుబ్రెప్ బ్రిడ్జి విషయాన్ని ప్రస్తావించారు. డైకస్‌రోడ్డులో ఆధునిక జంతువధ శాలకు స్వయంగా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసినా, నిర్మాణపు పనులు ప్రారంభం కాకపోవడానికి కారణాలు చెప్పాలని స్వతంత్ర సభ్యుడు షఫీ నిలదీశారు. కమీషనర్ రామసుబ్బారెడ్డి ఈవిషయంలో వివరణ ఇస్తూ - ఈ జంతువధ శాల ప్లాను అమోదించే విషయంలో పైస్థాయిలో కాసింత గందరగోళం జరిగిందని; ఏప్రిల్ 15 తేది నిర్మాణ పనులకు టెండర్లు పిలుస్తున్నామన్నారాయన. నీలగిరి సంఘం, వేదాయ పాళెం, టీచర్స్ కాలనీ, శివాజీనగర్, జ్యోతినగర్, ట్రంకురోడ్డు మునిసిపల్ కొళాయిల్లో నీరు రావడం లేదని ఆయా వార్డు సభ్యులు మధుసూదన్, ఆసియా బేగం, రమ్మ మాదాల వెంకటేశ్వర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు.

మద్య నిషేధాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ విప్ చాట్ల నరసింహారావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కౌన్సిల్ ఆమోదించింది. ఇటీవలే మరణించిన స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి మృతికి మునిసిపల్ కౌన్సిల్ సంతాపాన్ని ప్రకటించింది. అజెండాలోని సగం అంశాలు మిగిలి వుండగానే కరెంట్ పోయింది. అప్పటి వరకు ఛేర్మన్ కుర్చీపై ముళ్లమీద వున్నట్లు కూర్చుని వుండిన దశరధరామయ్య ఆపాటుతోమగతా అంశాలు ఆమోదమై పోయాయని ప్రకటించి,సమావేశం ముగించి, కుర్చీ దిగి పరిపరిగా వెళ్లిపోయారు.

నెల్లూరుసంగతులు

వేరు కుంపట్లయినా.... బంద్ విజయవంతం!

తెలుగు దేశం ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు 2 తేది జరిగిన బంద్ నెల్లూరులో విజయ వంతమయ్యింది. బంద్‌లో హడావుడంతా యువజన కాంగ్రెస్ వాయకులది. ఎప్పుడూ లేని విధంగా ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గన్నారు.ఇప్పటి వరకు నెల్లూరుకి చంద్రబాబు దిష్టిబొమ్మ దగ్గం కాకుండా కాపాడుతూ వచ్చిన పోలీసులు - నర్తకి సెంటర్‌లో సిఎం దిష్టి బొమ్మను ఉరివేసి, కాల్చినా ఆ పరిసర ప్రాంతాల్లో కన్పించకుండా పారిపోయారు. దేవకుమార్‌రెడ్డి, సునీల్ కుమార్‌రెడ్డి ద్వయం విజయమహల్ సెంటర్ గేటు వద్ద కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను కాసేపు నిలిపివేశారు. యువజన కాంగ్రెస్ జిల్లా

కరవ 8 పేజీలో

జీతాలివ్వలేని దుర్గతితోనే నిరసన దీక్ష చేయాల్సి వచ్చింది!

8 రోజుల పాటు రాజధానిలో మునిసిపాలిటీల సమస్యలపై నిరాహార దీక్ష జరిపి; ప్రభుత్వం దిగి వచ్చేలా చేసిన రాష్ట్ర మునిసిపల్ ఛేర్మన్ల ఛాంబర్ అధ్యక్షుడు ఆనం వివేకానందరెడ్డి 30 తేది నెల్లూరు వచ్చారు. వివేకానందరెడ్డికి రైల్వే స్టేషన్‌లో అపూర్వ స్వాగతం లభించింది. మునిసిపల్ ఛేర్మన్లకు ఇటువంటి స్వాగతం ఎప్పుడూ జరగలేదనే చెప్పాలి. ఈ సందర్భంగా తన స్వగృహంలో వివేకానందరెడ్డి విలేఖరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయాలు మునిసిపాలిటీల ఉనికికే ప్రమాదకరమై నందువల్ల మరో గత్యంతరం లేక నిరాహార దీక్ష చేయాల్సి వచ్చింది. రాజ్యాంగరీత్యా కల్పించిన హక్కులను స్థానిక సంస్థలకు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినా బ్యూరోక్రాట్లు అడ్డుపడు తున్నారు. రాష్ట్రంలోని 108 మున్సిపాలిటీలలో 80 శాతం తమ సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నాయని వివరించారు. ఛేర్మన్ల 8 రోజుల దీక్ష అనంతరం తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన అన్ని పార్టీల నాయకులకు వివేకానందరెడ్డి కృతజ్ఞతలు చెప్పారు. మునిసిపాలిటీలకు 150 కోట్ల నిధులతోపాటు ఛేర్మన్లకు న్యాయపరమైన హక్కులు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్లు రాఘవరెడ్డి, సందాసీబాషా, నరసింహారావు లక్ష్మయ్య, సురేష్, విజయకుమార్, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి అమ్ముడుపోయారు!

మద్య నిషేధాన్ని సడలించింది మొదలు భారతీయ జనతాపార్టీ

వివేకానందరెడ్డి వివరణ

యువమోర్చా సభ్యులు తమ వ్యతిరేకతను పలు రకాలుగా వెల్లడిస్తున్నారు. 31 తేది ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ సభ్యులతో కలసి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యకర్తలను ఉద్దేశించి యువమోర్చా జిల్లా అధ్యక్షుడు మిడతల రమేష్ మాట్లాడారు. రాష్ట్రంలో నేడున్న బోగస్ రేషన్ కార్డులను ఏరివేస్తే 600 కోట్లు, వృత్తిపన్ను సక్రమంగా వసూలు చేస్తే 300కోట్లు వస్తుంది; విద్యుత్ బకాయిల్ని ఖచ్చితంగా వసూలు చేస్తే 100కోట్లు వస్తుంది. కాని ప్రభుత్వం ఈ పనులకు పూనుకోవడం లేదు. మాఫియా గ్యాంగ్‌లకు అమ్ముడుపోయి ముఖ్యమంత్రి మద్యాన్ని తిరిగి ప్రవేశపెట్టారు. ఎందరి జీవితాల్లోనో చిచ్చుపెట్టి 500 కోట్లు రాబడి రాష్ట్రం ఆర్జించ కుంటె వచ్చే నష్టమేమిటో చంద్రబాబు నాయుడు ప్రజలకు వివరించాలన్నారు. ధర్నా కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకురాళ్లు లక్ష్మి, షంపాద్ బేగం కూడా పాల్గొన్నారు.

అష్టావధానం

ఎల్ఐసి ఎంప్లాయీస్ స్పోర్ట్స్ అండ్ రిక్రియేషన్ క్లబ్, సర్వోదయ కళానిలయం సంయుక్తంగా 6 తేది టౌన్‌హాల్‌లో అష్టావధాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. కొండపి మురళీకృష్ణ అవధానిగా వ్యవహరించి ఈ కార్యక్రమంలో డి.వి. రమణయ్య, బి.వి. నరసింహాలు, కె. రమణయ్య, సిహెచ్. రామచంద్రయ్య, స్వయంపాకుల శ్రీనివాసులు, ఎ. శేషకుమార్, పాయ్యసం సుబ్రహ్మణ్యం, పి. వెంకటేశ్వర్లు పృచ్ఛకులు. కార్యక్రమాన్ని సాహితీవేత్త డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి స్మృత్యంకంగా నిర్వహిస్తున్నారు.

ముఖ్య ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియ జేయడ మేమనగా మాలవ్యానగరు, గూడూరు, డోర్ నెం.575 మా యింటి ముందు గల భారీ స్థలం (అం.27 అ.42)ను పెనుబోలు హంస వేణమ్మకు యిచ్చి ఓడూరు గ్రామంలో ఎ.9.86సెం. ఆమె స్వాధీనంలో యున్న భూమిని 5.8.96 తేదిన మార్పు చేసికొన్నాము. దానికి మేము పాసు పుస్తకాల కొరకు దరఖాస్తు చేయగా అందులో 2 ఎకరాల పైచిలుకు భూమి తగ్గుచున్నది అందువలన మా స్థలము ఆ విలువ ప్రకారం ఆమెకు అం.16.42 అడుగులు మాత్రమే హక్కు గలిగి వున్నది. దానిని కాని, మరి ఏ ఇతర పెనుబోలు వెంకురెడ్డి ఆస్తులు కాని 9.6.1975 తేదిన ఆమె భర్త పెనుబోలు వెంకురెడ్డి రిజిస్టరు చేసిన వీలునామా ప్రకారం ఏ విధమైన పరాధీనము గాని విక్రయించుటకు గాని ఆమెకు హక్కులేదు. ఈ విషయం తెలిసిగాని, తెలియక గాని ఆ స్థలము మీద ఎవరైనా ఏ రకమైన లావాదేవీలు జరిపిన నేను తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు అవుతారు.

... **తన్నమాల నారాయణరెడ్డి**, గూడూరు, నెల్లూరు జిల్లా

అమెరికా వెళ్లుతున్నారా!
BEST FARES TO U.S.A.
AIR INDIA LUFTHANSA
BRITISH AIRWAYS
CONTACT:
Sri Sai International Travels
NELLORE Ph: 0861-28678
HYDERABAD Ph: 040-292616

నెల్లూరు వుబ్బళ్ళు

విశేషాంశాలు

ఢిల్లీలో జనార్దనరెడ్డి

రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ నేదురుమల్లి జనార్దన రెడ్డి ఢిల్లీ రాజకీయ సంక్షోభంలో తల మునకలుగా వున్నారు. వెంకటగిరి వైద్య శిబిరంలో వున్నప్పుడు ఆ వార్త అందిందాయనకు ; అట్నుంచి అటే ఢిల్లీ వెళ్లిపోయారు. సీతారాం కేసరి, శరద్ పవార్, మూపనార్‌ల మధ్య కీలక సంధానకర్తగా వ్యవహరిస్తున్నా రాయన.

రాజ్యలక్ష్మి గారి వైద్య శిబిరం

శ్రీమతి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ నేతృత్వంలో 30 తేది వెంకటగిరిలో జరిగిన వైద్య శిబిరాన్ని పోలేరమ్మ జాతరతో పోల్చవలసిందే. ఇరవై వేల మంది పేదలు – వెంకటగిరి, రాపూరు, కాళహస్తి, నాయుడుపేట గ్రామాల నుంచి – ఒక వరద వలె వచ్చిపడ్డారు. అంత విశాలమైన విశ్వోదయ కాలేజి ఆవరణం ఇరుకై పోయింది. మద్రాసు, నెల్లూరు, హైదరాబాద్‌ల నుంచి దాదాపు వంద మంది డాక్టర్లను రప్పించా రామె. ప్రఖ్యాత హృద్రోగ నిపుణుడు డాక్టర్ కెవన్ రెడ్డి వంటి వారెందరో వచ్చారు. పన్నెండు లక్షల విలువైన మందులు ఉచితంగా పంచారు. ఎక్స్‌రేలు, బ్లడ్ టెస్ట్‌లు వందల సంఖ్యలో జరిగాయి. హైదరాబాద్ స్వప్న నర్సింగ్ హోం డాక్టర్లు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. అంత జనానికి భోజనం, చల్లటి మజ్జిగ, ఐస్‌వాటర్, కాఫీ సరఫరా చేశారు. ఏ లోటూ రానివ్వలేదు.

ఆ జనాన్ని నియంత్రించడం ఎవరికీ తలివి కాలేదు; డాక్టర్లకైతే వూపిరి సల్పలేదు. నేత్ర చికిత్స, గుండె పరీక్ష గదుల దగ్గర మైలు పొడవున క్యూలు వీర్పడ్డాయి. పరిస్థితి అదుపు తప్పి పోవడంతో జనార్దన రెడ్డి గారే స్వయంగా కర్రచేత పట్టుకొని, ఒక వాలంటీర్ వలె రోగులను నియంత్రించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఎర్రటి ఎండ కూడా లెక్క చేయకుండా రాజ్యలక్ష్మి గారు శిబిర నిర్వహణలో అటుఇటు తిరుగు తుండినారు. మధ్యాహ్నానికి ఆమెను చూస్తే – శోష వచ్చి పడిపోతుందేమో నన్పించింది; కానీ పట్టుదల వదలకుండా పనిచేశా రామె. వెంకటగిరి లోనేకాదు – జిల్లాలోనే కాదు – రాష్ట్రంలోనే ఎప్పుడూ, ఎక్కడా ఇంత విస్తృత స్థాయిలో వైద్య శిబిరం జరిగి వుండదు. షిర్డిసాయి రూరల్ వెల్ఫేర్ ఫౌండేషన్ తరపున డాక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, డాక్టర్ శ్రీధర్ రెడ్డి ఈ శిబిర సారథ్యం వహించారు.

రాజలక్ష్మి గారు ఇంత శ్రమ పడడానికి కారణ మేమిటి? ఇప్పటి వరకు ఆమెకు ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధం లేదు; ఇప్పుడటువంటి ఆలోచన లేవైనా వచ్చాయా? జనానికి దగ్గర కావడానికి ఇదొక మార్గంగా భావించారా? ఆమె ఆలోచన ఏదైనా – ఆమె చేసిన కార్యక్రమం మాత్రం గొప్పది. అందుకామె అభినంద నీయురాలు.

గుండెజబ్బులకు ఉచిత చికిత్స

నెల్లూరీయుడు, హైదరాబాద్ మహావీర్ ఆస్పత్రి కార్డియాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ వి. భాస్కర రావు 13 తేది గూడూరులో ఒక ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. వసుంధర మహిళా వికాస్ ఆధ్వర్యంలో, రాజవీధిలో జరిగే ఈ శిబిరంలో గుండె జబ్బులకు ఉచితంగా పరీక్ష చేసి, సలహాలు ఇస్తారు.

భాస్కర రావు గారు మంచి హస్తవాసి కల్గిన డాక్టరు; పేదల పట్ల సానుభూతి కల్గిన, సేవా దృక్పథం కల్గిన వారు; నెల్లూరు నుంచి తన దగ్గరకు వచ్చే రోగులకు అత్యంత ప్రేమతో చికిత్స చేసి పంపు తుంటా రాయన. హృద్రోగులకు చక్కటి అవకాశం ఇది; సంప్రదించండి!

రెండవ పంటకు నీళ్లు

పెన్నా డెల్టా క్రింద రెండవ పంటకు నీరివ్వాలని నిర్ణయించారు అధికారులు; సోమశిలలో పుష్కలంగా నీరుండడంతో ఇది సాధ్యమైంది. జూలై 15 తేది వరకు నీటి సరఫరా వుంటుంది. సోమశిల ఉత్తర, దక్షిణ కాలువలు; కావలి, కనుపూరు కాలువలు; నెల్లూరు, సంగం ఆనకట్టల క్రింద వుండే ఆయకట్టుకు నీరు అందిస్తారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకొని, అందరికీ పంట పండేటట్లు వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు కలెక్టర్ డి. సాంబశివ రావుగారు!

చక్కర ఫ్యాక్టరీ ఎండికి దేహశుద్ధి

కోవూరు చక్కర ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వీరభద్ర రావును ఆ ఫ్యాక్టరీ కార్మికులే చితక దన్నారు. తమ సమస్యలు చెప్పుకోను వెళ్లిన కార్మికులను ఆయన అసభ్యంగా తిట్టారట; వారికి వళ్లు మండి, దేహశుద్ధి చేసి, చేతులు కట్టి, ఒక గదిలో పారేశారు. తర్వాత కలెక్టర్ వచ్చి అతడ్ని విడిపించ వలసి వచ్చింది. పైగా ఎండి చేత కార్మికులకు క్షమాపణలు చెప్పించారు కలెక్టర్ గారు.

ఈ ఎండిగారు గుడిని, గుడిలో లింగాన్ని దిగమ్రింగే ఘనాపాఠి; ఆయన వచ్చిన తర్వాత ఫ్యాక్టరీలో చక్కర అవినీతితో చేదెక్కి పోయింది. కింగ్ ఆర్డర్‌కు కూడా లంచా లివ్వాల్సిన దుస్థితి. బ్యాంకులో బ్యాలెన్స్ మిగల కుండా ఎప్పటి కప్పుడు డ్రా చేసి – రోడ్లు, విశ్రాంతి మందిరాల పేరుతో ఖర్చు వ్రాసి దిగమ్రింగడం ఆయన వృత్తి. ఇప్పుడు రైతులకు కూడా డబ్బివ్వలేని దుస్థితికి చేరుకున్నది ఫ్యాక్టరీ.

ఇటువంటి ప్రబుద్ధులకు దేహశుద్ధి తగిన శిక్ష; ఆ కార్మికులు మంచి పనిచేశారు.

కేబుల్ టివి చందాలు – జెసికి ఏమి సంబంధం?

టౌనులో కేబుల్ టివి చందాలు తగ్గించాలని కొందరు వినియోగ దారులు కోరడంతో – జాయింట్ కలెక్టర్ డాక్టర్ నాగేశ్వర రావుగారు ఇప్పటికి మూడు సమావేశాలు నిర్వహించారట. అందులో చందా రేట్లు రూ.30 లేదా రూ.40లకు తగ్గించాలని కేబుల్ ఆపరేటర్లపై కొందరు వినియోగ దారులు వత్తిడి తెచ్చినట్లున్నారు; లేకుంటే ఆ వైర్లు తమకు స్వాధీనం చేయాలని జెసిని కోరారట వారు.

ఈ వినియోగదారులు స్పృహ వుండి వైర్ల అప్పగింత కోరారా అన్నది సందేహం. కేబుల్ టివి ప్రసారం పూర్తిగా ప్రైవేటు వ్యాపారం; తమకు వచ్చిన రేటు నిర్ణయించుకొని స్వేచ్ఛ వారికి వుంటుంది. అభ్యంతర పెట్టడానికి మనమెవరం? కేబుల్ కనెక్షన్ తప్పకుండా తీసుకోవాలన్న నియమం ఎక్కడా లేదు; కొత్తవారు ఈ వ్యాపారం చేయకూడదన్న నిబంధన అసలే లేదు. కొందరు డాక్టర్లు కూడా ఈ సమావేశంలో పిడివాదనలు చేసినట్లున్నారు. ఆ డాక్టర్లు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారు కాబట్టి, వారి నర్సింగ్ హోంలు తమకు అప్పచెప్తే తక్కువ ధరకు వైద్యం చేయిస్తామని రోగులు అడిగితే ఇస్తారా? కేబుల్ టివి సైతం అంతే కదా? ఈ వ్యాపార గొడవల్లో జెసిని ఇరికించడం తప్పు; అది ఆయనకు సంబంధించిన వ్యవహారం కాదు. రేటు నచ్చితే కనెక్షన్ తీసుకోవడం, లేదంటే వదులు కోవడం మాత్రమే వినియోగదారులు చేయగల్గింది. ★

భక్తుని నిర్యాణం

శ్రీ రామకృష్ణ సేవాసమితిలో క్రియాశీలక కార్యకర్తగా ఎనలేని సేవ చేయడమే గాక, ఎంతో మందిని రామకృష్ణ ప్రభ చందాదారులుగా చేర్పించిన శ్రీ దేసూరి ఆదినారాయణ రెడ్డిగారు తమిళనాడులో యిటీవలనే దివంగతులైనారని తెల్పుటకు చింతిస్తున్నాము. వారి ఆత్మకు శ్రీ రామకృష్ణ భగవానుడు శాశ్వత శాంతిని చేకూర్చుగాక అని ప్రార్థిస్తున్నాము.

– శ్రీ రామకృష్ణ సేవాసమితి కార్యవర్గం

125 ఎకరాల
మామిడితోట అమ్మబడును

కావలి పట్టణానికి దగ్గరలో రోడ్డుకు ఆనుకొని, మంచినీటి వసతి గలిగి, కాపులో వున్న 125 ఎకరాల మామిడి, ముంత మామిడి, టేకు తోటలు విడివిడిగా గాని లేక మొత్తంగా కాని అమ్మబడును. వివరాలకు సంప్రదించండి.

డి. రామరాజు

8-128-1, భాగ్య నిలయం, ఆల్వాల్, సికింద్రాబాద్-500 010.
ఫోన్: 040-860823

ఇండ్ల ప్లాట్లకు భూమి అమ్మబడును

నెల్లూరు – కృష్ణపట్నం రోడ్డులో అపోలో హాస్పిటల్ ఎదురుగా నెల్లూరు సెంట్రల్ స్కూలు ప్రక్కనే
ఎ. 2.62 ట్లు భూమి అమ్మబడును.
వివరాలకు
ఫోన్: 24991; 24973

బొప్పాయి మొలకలు

మా నర్సరీలో శాస్త్రీయ పద్ధతిలో పెంచబడిన కోయంబత్తూరు హైబ్రీడ్ CO-2 బొప్పాయి మొలకలు నాటుటకు సిద్ధంగా వున్నవి.
Note: ఏప్రిల్ 20 తేదీలోగా నాటుకొనవలెను.

సరస్వతి ఫామ్స్ (SARASWATHI FARMS)

ఇసకపాళెం, వెంకటాచలం మండలం
(ఇసకపాళెం కరెంటు సబ్ స్టేషన్ ప్రక్కన) నెల్లూరు - 524 323

సమ్మర్ మరియు ఉగాది పండుగ సందర్భంగా
"బొమ్మన" వారి మెగాసేల్

సమ్మర్ కోటా చీర → రూ. 65/- లకే
కాటన్ చీరలపై ★ 30% డిస్కౌంట్
కిడ్స్ రెడీమేడ్స్ పై★
రెడీమేడ్ షర్ట్స్ పై★
సమ్మర్ కాటన్ మిడ్డీస్ పై
ట్రస్సర్ శిల్క్ శారీస్ పై
→ 50% డిస్కౌంట్
★ నిర్ణయించిన వాటిపై 20% నుండి 50% డిస్కౌంట్

బొమ్మన బ్రదర్స్
లేడీస్ & జెంట్స్ క్లాత్ షోరూం
కావుటీధి, నెల్లూరు. ఫోన్: 28475

సణుగుడు

రెండవ పేజీ కొరవ

రమణమ్మలు రాజా తనకు అత్తంగా పెట్టుకున్న బొమ్మలు మాత్రమే. తాను వెనక నుండి వారికి ప్రచారం కల్పించారాయన. అక్షరాస్యతా ప్రచారం కోసం గ్రామాలకు వెళ్లి, పేద ప్రజలతో సాన్నిహిత్యం పెంచుకొని, అతి దగ్గర నుంచి వారి జీవితాలను పరిశీలించే అవకాశం లభించడం వల్ల – సారాయి మహమ్మారి పేదల రక్తం ఎట్లా పిండు కొంటున్నదీ గ్రహించి, కలత చెంది, ఆవేదనతో, ఆవేశంతో, ఆలోచనతో అత్యంత నిర్దుష్టంగా ఈ ఉద్యమానికి బీజం వేశారాయన. సామాజిక స్పృహ, సమాజానికి ఏదో చేయాలన్న తపన, తలపెట్టిన పనిని ఒక తపస్సు వలె నిర్వహించ గల్గిన దక్షత, రాత్రి పగలు తేడా లేకుండా శ్రమించే ఓర్పు, సమస్యలను ఎదుర్కొనే సాహసం, లక్ష్యం పుష్కలంగా కల్గినవాడు కాబట్టి – ఇంత గొప్ప సంఘ సంస్కరణోద్యమాన్ని రూపకల్పన చేయగలిగారు రాజా గారు!

మద్య పానం ఒక వ్యక్తిగత వ్యసనం; సామాజిక దురలవాటు. కానూనాలతో, చట్టాలతో, ఉపన్యాసాలతో దాన్ని రూపు మాపడం అసాధ్యం. అందువల్లే రాజాగారు మహిళలను పురికొల్పి, వారిని చైతన్య వంతం చేసి, జాగృతి కల్గించి, ఒక మహా సామాజిక సంగ్రామానికి వారిని ఈటెల వలె తయారు చేశారు; ఒక్కొక్కరు ఒక్కొక్క రుద్రమదేవి వలె విరుచుక పడేలా ఉత్సాహం కల్గించారు. సారా వల్ల జరిగే అనర్థాలు చిలకకు చెప్పినట్లు చెప్పారు. అందుకోసం ఆయన ఎన్ని రాత్రులు నిద్రలేకుండా మారుమూల పల్లెటూళ్లలో జనం మధ్య గడిపారో లెక్కలేదు. అధికారిగా తను బయట పడలేక తెర మరుగున వుండిపోయాడు కాని లేకుంటే రాజు గారి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిల్చి పోయి వుండాల్సిది.

ఒక కలెక్టర్ అంత శ్రమించి ఆడపడుచుల ఆశా సౌధం నిర్మిస్తే; ఇంకొక కలెక్టర్ అంతే కష్టంతో దాన్ని కూలగొట్ట వలసి రావడం దురదృష్టకరం. అయితే సాంబశివరావు గారు మహిళల ఉద్యమ స్ఫూర్తిని తక్కువగా అంచనా వేస్తున్నట్లు కన్పడుతూంది. అందువల్లే ఆయన పోలీస్‌లను, అధికారులను పురమాయించి ఉద్యోమాన్ని నిర్వీర్యం చేయ జూస్తున్నట్లున్నారు. అదే నిజమైతే మాత్రం ఆయన పప్పులో కాలువేసినట్లే! నెల్లూరు నారీమణుల పట్టుదల ఎటువంటిదో తెలుసు కోవడానికి కలెక్టర్ గారికి చాలా సమయం పడుతుంది.

In the court of the District Munsif Sidhout

O.S. No. 148/96

Between

Rayalaseema Gramena Bank, Atlur ... Plaintiff

Vs.

1. Duddukuru Naga Subbamma W/o. D. Narayana, Petty Shop Business Residing at Virur (V), Lakkireddygari Palli Post, Atlur Mandal.
2. Thunga Thirupalaiah S/o. T. Nagaiah, Business Residing at Virur(V), Akkireddygari Palli Post, Atlur Mandal

... Defendents

Where as the Plaintiff filed the suit against you for recovery of the Loan amount. The suit is posted for your appearance on 14.4.97 at 10 AM. Your failure to appeare before the Court will be treated as Exparte.

K. KRISHNA MURTHY
Advocate B.A.B.L.,
D.No.12/346 (Upstairs)
Hanumappa Street,
Cuddapah - 516 001

జనరల్ నోటీసు

లేట్ బొందిలి చిన భవాని సింగ్ కుమార్తె అయిన నేను యావన్మందికి తెలియ జేయడ ఏమనగా నా తండ్రిగారు మరియు పెద్ద తండ్రి గారు అయిన లేట్ పెద్ద భవాని సింగ్ ఆస్తులలో నాకు, నా సోదరీమణులకు వాటా హక్కులు కలవు. వాస్తవాలను మభ్యపరచి, చిన్న భవాని సింగ్ కుమార్తెలను మోసము చేయవలెనను దురుద్దేశ్యముతో నా తమ్ముళ్లు B. రాంరాజా సింగ్ మరియు B. కిషోర్ సింగ్ గార్లు వ్యవహరిస్తున్నారు. ఈ వివాదము నెల్లూరు సబ్ కోర్టులో O.S.No. 133/96 దావాగా పెండింగ్‌లో యున్నది. మాకు అన్యాయం చేసి నష్టపరచ పలెననే ఉద్దేశ్యంతో పై చెప్పిన వారు ఆస్తులను ముఖ్యముగా నెల్లూరు శోధన్ నగర్‌లోని డోర్ నెం.23/1212 ఆస్తిని అన్యాక్రాంతం చేయ ప్రయత్నిస్తున్నారు. పెద్ద భవానీ సింగ్ మరియు చిన్న భవానీ సింగ్ గార్ల ఆస్తులను ఎవరూ కొనరాదు. అట్లు కొనిన వారికి ఎలాంటి హక్కులు ఏర్పడవు. ఏ పరాధీము లైనను మా హక్కులకు లోబడి ఉండును. అట్లు కొన్నవారు నేమ బరుపు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు భద్దులు కాగలరు.

B. మాధురిబాయి
w/o B. సీతారాం సింగ్

అడ్వకేట్లు
K.A.S. గుప్తా, B.Sc.,BL.,
K.L. దరోజి, B.A.,BL.,

ఘనకార్యమే

మొదటి పేజీ కొరవ

సీతారాం ఫైలు నడిచిన స్పీడు చూసి దీనిపై ఎసిబి దర్యాప్తు జరపమని ఆదేశించారు. కానీ అర్జున రావుగారు మంత్రి ఉత్తర్వును ఖాతరు చేయలేదు. అదనపు ఎఫ్‌ఎస్‌ఐ మంజూరుకు రెండు కోట్ల 20 లక్షలు అపరాధ రుసుం కట్టాలని ఒక అధికారి వ్రాశారట; దాన్ని సిఎం 65 లక్షలకు తగ్గించారు; కానీ ఉత్తర్వు వచ్చేసరికి అది 30 లక్షలకు తగ్గి పోయింది. ఫైలు ఇంత దూరం నడుస్తున్నా – అసలు ప్రభుత్వానికి చెందిన భూమిని ఒక ప్రైవేటు వ్యక్తి ఆక్రమించడం; దానికి తామంతా చట్టబద్ధత కల్పించడం ఏమిటన్న స్పృహ ఏ అధికారికీ కల్గలేదు. అందరూ కళ్లు మూసుకొని సంతకాలు పెట్టేశారు.

సిఎల్‌పి నేత శ్రీ పి. జనార్దన రెడ్డి పుణ్యాన ఈ స్కామ్ వెలికి వచ్చింది కాని, లేకుంటే ఆ భూమి మేగోరి పరమై వుండేది; ఎనిమిది కోట్లు జేబులో పడి వుండేవి. పాపం, బ్యాడ్‌లక్. *

రామోజీరావు

మొదటి పేజీ కొరవ

తూడ బెట్టినా వ్యర్థమే!

* * *

మద్య నిషేధంపై ప్రజలలో పెద్దగా వ్యతిరేకత పెల్లుబుక లేదని ఇంటలిజెన్స్ వర్గాలు నివేదిక సమర్పించడంతో ముఖ్య మంత్రి మహదానందంగా వున్నారు. బిజెపి, కాంగ్రెస్‌లు ఉద్యమం ప్రారంభించి నప్పటికీ దానిని జనం ఆదరించరనే నిశ్చితాభిప్రాయానికి వచ్చి, నిశ్చింతగా ఢిల్లీ రాజకీయాలలో తలమునకలై పోయారాయన. ఆర్థిక వ్యవస్థ దివాలా కోరుతనం, స్మగ్లర్ల వీరవిహారం వల్లనే మద్యం తిరిగి ప్రవేశ పెట్టడం జరిగిందన్న తన వాదనను ప్రజలు విశ్వసించినట్లు తోచడంతో చంద్రబాబు ఆనందానికి పట్టపగ్గాలు లేవు. కాని ఆయన అభిప్రాయాలు సరైనవా లేక మహిళలలో ఈ మోసం పట్ల నివురుకప్పిన నిప్పు వలె ఆగ్రహం దాగి వున్నదా అన్న విషయం – ఏదో ఒక ఎన్నిక జరిగితే కాని తేలదు.

ఉద్యమ వీరులు

మొదటి పేజీ కొరవ

లాభనష్టాలు; సీట్ల పంపకంలో మొగమాటాలు తప్ప సిద్ధాంతాలు, విధానాలు, ప్రజల మనోగతాలు లక్ష్య పెట్టదగినవి కావన్న నిర్ణయానికి వచ్చేసి నట్లున్నారు వారు. ఒక్క గండవరపు సేతు రామరెడ్డి గారు మాత్రం తన వైఖరి మార్చుకో కుండా అప్పుడు, ఇప్పుడు ఒకే నిలకడతో ఉద్యమంలో పాలుపంచు కొంటున్నారు. ఆయన చాదస్తుడు మరి! న్యాయవాది శ్రీ వి. అనంత రామయ్యకు మొగమాటలేవీ వుండవు కాని – వైరాగ్యం సంప్రాప్తించి నట్లుంది. దాన్ని వదల గొట్టి వారెవరైనా వుంటే ఉద్యమానికి నోరున్ననేతగా వుపకరిస్తాడు. పిసి రెడ్డి గారిలోనూ మార్పులేదు.

ఆనాడు ఉద్యమానికి వూపు తెచ్చిన మహిళా కార్యకర్తలు దీనిపై ఎట్లా స్పందించ బోతారన్నది వేచి చూడాలి. నాయకుల వలె వారు గడ్డి కరిచే నీచ బుద్ధులు కల్గిన వారు కాదనే విశ్వ సిద్ధం.
*

షేర్లలోకం

రెండవ పేజీ కొరవ

అడియాసే! రిజర్వు బ్యాంకు దగ్గర ఇప్పుడు 22 బిలియన్ డాలర్ల విదేశీ రబ్బు వుందని చిదంబరం సంతోష పడ్తుండినాడు; కానీ ఈ సంక్షోభం వల్ల అవన్నీ వెనక్కు వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. అదే జరిగితే రూపాయి విలువ పడిపోతుంది. డాలర్ ధర ఆకాశం అంటుతుంది. దాని ప్రభావం విదేశీ వ్యాపారంపై అపరిమితంగా వుంటుంది. దిగుమతులు నష్టదాయక మౌతాయి; ప్రాజెక్ట్ పెట్టుబడులు పెరిగి పోతాయి. రబ్బు చాలక సగంలో నిల్చి పోతాయి. అభివృద్ధి ఆగుతుంది; నిరుద్యోగం పెరుగుతుంది. విదేశీ సహాయంతో ప్రారంభించ తలపెట్టిన విద్యుత్, రేవు, రోడ్ల నిర్మాణాలు నిల్చిపోతాయి. ఇన్ని రకాల దుష్ఫలం చూపే నిర్ణయం తీసుకొన్న శేషరిని ఏమని నిందించాలి? అతడి అజ్ఞానను ఎట్లా సహించాలి?

***

ఈ దుస్థితి నుంచి దేశాన్ని రక్షించడానికి రాష్ట్రపతి శ్రీక్యమే శరణ్యం. ఆర్థిక వ్యవహారాల నియంత్రణకు తన పర్యవేక్షణలో జాతీయ కౌన్సిల్ ఒకటి ఏర్పాటుచేసి; అన్ని పార్టీలకు చెందిన చిదంబరం, మన్‌మోహన్‌సింగ్, విపి సింగ్ వంటి ఆర్థిక నిపుణులను అందులో భాగస్వాములను చేసి; ఆర్థిక సంబంధిత నిర్ణయాలన్నిటినీ వారి సలహాతో రాష్ట్రపతి తీసుకొనే వ్యవస్థ ఒకటి ఏర్పడడం దీనికి పరిష్కార మార్గం. రాజకీయాలకు అతీతంగా ఆర్థిక సంస్కరణలను కొనసాగిస్తే తప్ప దేశం బాగుపడదు.

***

మాటలతో ఆట - 50

	1	2		3			4	5	
6			7			8			
		9			10		11		12
	13				14			15	
16				17			18		
19			20			21			
		22			23				24
	25			26				27	
28			29			30	31		
32				33			34		

అడ్డం:

1. అవాక్కులో మాట (2)
2. అమ్మమ్మకు, నానమ్మకు మరొక బిరుదు (2)
4. హేతువు (3)
6. వారణాసిలో కత్తిని పట్టండి (2)
7. గోకర్ణంలో చెవి (2)
8. తులిపి పనులు చేసేవాడు (3)
9. ఎత్తుపల్లాలను వాటంగా చేర్చడం (2)
10. తెల్లరంగు వలువ మొదటి అక్షరాల కూర్పు; స్త్రీ (3)
13. అడిగితే 12 అంగుళాలు (3)
14. మరకలో మ వద్దు (2)
15. ఇది వస్తే నిద్రాభంగం (2)
16. వెంట్రుకకు కోపం కూడానా (3)
17. Frequency; తడవ (2)
18. శ్రీకృష్ణుని భక్తురాళ్లకు ఏకవచనం (3)
19. తెలుగు వాళ్ల గౌరవ వాచకం (2)
20. భలేమంచిదిలో స్త్రీ (2)
21. కమలనయనలో మొదటి మూడు (3)
22. కొండెం (2)
23. అనగనగా ఒక కాయంలో అవశ్యం (3)
25. ఎల్లకరలో ఆహారం (2)
26. చిన్నసైజు పార (2)
27. సుబ్రహ్మణ్యస్వామి జన్మ స్థానం(2)
28. పశుప్రసవం (2)
29. స్త్రీ అంటే అక్కడ అనికూడా (2)
30. పక్కము; ముందు వెనకలైంది (3)
31. పడక; శయ్య (2)

నిలువు:

1. వారణాసిలో మేలిమి (2)
3. సముద్రం (2)
4. ఏటి నీళ్లను పొలాలకు మళ్లించడానికి తవ్వింది (3)
5. రవ్వకు వత్తులేదు (2)
6. ముద్రణ (2)
7. తొర్ర అంటే ఒనగూడటమే (3)
8. ముస్లిం సోదరుడు (3)
9. ఉపయోగించడం (3)
10. వాన నిలిచిపోతే (3)
12. కొత్తిమీర కట్టంత జాట్టులో పిల్లమొలక కూడ (3)
13. పువ్వు (3)
15. గోవు (3)
16. అన్నగారి బోధంలో చూస్తే ఎక్కువ లోతు వుండేది (3)
17. చెమ్మ (2)
18. ఆవుపేడ (3)
20. ఇంగ్లీషు స్త్రీ జింకగా మారింది(2)
21. తుక్క ఈ సింహాసనంపై కూర్చున్నా బుద్ధి మార్చుకోదు(4)
22. గిర (2)
23. తుమ్మెద (2)
24. దంతమే (2)
25. బర్రె (3)
26. 'త' తోమొదలు నగ (3)
27. చెతులే (3)
28. పక్షిరోమం (2)
31. కృపి (2)

మాటలతో ఆట - 48 సమాధానాలు

అడ్డం: 1.శనిగ్రహం 4.సిరపాణి 7.వశిష్ఠ 8.కృష్ణ 9.చర 10.నక 11.శతి 12.సోన 14.మాళవిక 16.కాయ 17. అల 18.గలగల 21.త్రాణము 22.కమురు 23.వేసము 24.తోము 25.కాసు 27.మాము 28.త్రాచు 30.రమ 32.జోరు 33.మనసా 35.సాల 36.వేది 37.కిటికి నిలువు: 1.శాకల 2.నిష్ఠ 3.హంకృతి 5.రచన 6.పార 7.వనమాలి 8.కృతి 11.శశ 12.సోయగము 13.మాలతి 15.విన్నాణము 16.కాలకము 19.లదుకా 20.కరి 21. త్రాసము 23.వేమారు 28.త్రాతు 29.గూన 31.మనికి 32.జోల 33.మది 34.సాకి

సరియైన సమాధానాలు వ్రాసినవారు: మల్లాది వరుణ్, విజయవాడ; ఎన్. పార్వతి, కోవూరు; యస్వీయస్వి. రాజ్యలక్ష్మి, చిత్తూరు; పాటి వీరేశ్వరాచారి, నెల్లూరు; వజ్జల కృష్ణవేణమ్మ, కందుకూరు; నాయని మధుమూర్తి, విశాఖపట్టణం. విజేత: మల్లాది వరుణ్

నెల్లూరు బజారు

మొలగొలుకులు		
9672	క్రొత్తవి	3,500/-
	పాతవి	4,300/-
9674	క్రొత్తవి	3,500/-
	పాతవి	4,800/-
మహరి	క్రొత్తవి	4,500/-
	పాతవి	7,000/-
మొలగొలుకు బియ్యం		
బస్తా (70 కిలోలు)		750/-
బంగారు నవరత్న (8గ్రా.)		3,640/-

గ్రామదేవత తిరిగి వచ్చిందట - గ్రామస్తులు తన్నుకొంటున్నారు!

తోటపల్లి గూడూరు మండలం పేరూరు గ్రామంలో ఎప్పుడో వూరు నించి వెళ్లిపోయిందని చెప్పుకొనే గ్రామదేవత. తిరిగి గ్రామంలోకి ప్రవేశించిందన్న ప్రచారం జరగడంతో, ఆ గ్రామం కల్లోల భరితమై పోతూంది. ఆవూరి చెరువులో వున్న అతిపురాతనమైన శిధిలాలయంలో శిలా రూపంగా వున్న గ్రామదేవత సారుముడమ్మపునరుజ్జీవనం పొందిందన్న అంధ విశ్వాసం గ్రామస్తుల మట్టి బుర్రల నిండా పాతుక పోయిందిప్పుడు. ఈ దేవాలయం పాడుబడటానికి ఆ గ్రామంలో ఒక కథ ప్రచారంలో వుంది. కొన్ని తరాల కిందట సారుముడమ్మ ఈ గ్రామస్తులపై అలిగి, ఆగ్రహించి తాను గంగపట్నం వలస పోతున్నట్లు చెప్పేసి గుళ్లో నుంచి వెళ్లిపోయిందట. ఆమెను తిరిగి పేరూరుకు రప్పించడానికి గతంలో జరిగిన ప్రయత్నాలేవీ ఫలించలేదట. కానీ ఇటీవల ఒక దాసరి ఆగుళ్లోకి అడుగుపెట్టి తాను సారుమూడమ్మను తిరిగి గ్రామానికి రప్పించానని ప్రకటించాడు. దాన్ని వెర్రి జనం నమ్మేశారు. ఇక చూసుకోండి! ఆ శిధిలాలయం ఒక పుణ్యక్షేత్రంగా మారిపోయింది - రోజూ ఇసకేస్తే రాలనంత జనం! చదివింపులు నేయడం, పొంగళ్లు పెట్టటం, పొట్టేళ్లు దేవతకు వదలడం - ఇలా ఆ శిధిలాలయం మహిమ మండలస్థాయి దాటి జిల్లాకి ప్రాకిపోయింది.

దానితో ఆ గుడి మీద పెత్తనానికి గుడుగుడు గుంచాలాట మొదలైంది. అమ్మవారికి ప్రాణ ప్రతిష్ఠ చేసింది దళితుడు కావడంతో ఈ గుడిపై పెత్తనం తమకు దక్కాలని దళితులు పంతం పడుతున్నారు. వూళ్లోని తెలుగు దేశం నాయకులకు ఇది కంటగింపైంది. దళితులలో చాలా మంది కాంగ్రెస్ కార్యకర్తలు వుండటంతో వారిపై పార్టీ పరమైన దాడులు మొదలైనాయి. తెలుగు దేశం నాయకులు దౌర్జన్యంగా, దళిత పూజారిని ఆలయం నుంచి గెంటివేసి, ఒక బ్రాహ్మణ పూజారిని అతని స్థానంలో నియమించారు. దళితులు తిరగబడి దళిత పూజారిని గుళ్లోకి తెచ్చారు. ఇరువర్గాలూ తగవులాడుకొని, కేసులు పెట్టుకొన్నారు; రెండు ప్రక్కల నాయకులు చేరారు; సహజంగానే తెలుగు నాయకుల మాట శిరస్సు వహించారు పోలీసులు; ఆ గ్రామం ఉద్రిక్తంగా వుందిప్పుడు.

రాపూరులో మద్యం ధరలు పడిపోయాయి!

మద్య నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసినట్లు ప్రకటించగానే రాపూరులో అక్రమ మద్యం రేట్లు అమాంతంగా తగ్గి పోయాయి. ఇంతకు మునుపు ఫుల్ బాటిల్ విస్కీ, వెల రు400లు, ఇప్పుడది 200 రూపాయలకు పడిపోయింది. మద్యం స్మగ్లర్లు లక్షలాది రూపాయల స్టాకును రాపూరులో రహస్యంగా దాచి పెట్టి అమ్ముకొంటుండినారు. ప్రభుత్వ ప్రకటన వారికి ఆశనిపాత మయ్యింది. ఉన్న స్టాకు నంతా వెంటనే అమ్మేయాలని రేట్లు తగ్గించేశారు. మద్యం త్రాగడం ఇప్పుడు చట్ట ప్రకారం నేరం కాకపోవడంతో రాపూరులో ఏ వీధిలో చూసినా మద్యపాన ప్రియుల వీరంగాలు కనపడు తున్నాయి. ఏప్రిల్ 1 తేది ఒక్కరోజే 10 లక్షల పైగా విలువ చేసే అక్రమ మద్యాన్ని వెంకటగిరి, గూడూరు మద్యం ప్రియులు రాపూరు నుంచి పట్టుకెళ్లి నిషాఖుషి చేసుకొన్నారు.

పేడూరు ప్రజల మెదళ్లలో మట్టి చేరిందా?

జిల్లా ప్రజలు 63 కోట్లు పొదుపు చేశారు!

ఫిబ్రవరి మాసాంతానికి 63 కోట్ల రూపాయలను వివిధ పొదుపు పథకాల ద్వారా జిల్లాలో సేకరించడం జరిగిందని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎన్. నాగేశ్వర రావు చెప్పారు. 30 తేది కలెక్టరేట్ లోని సైక్లోన్ మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో మాట్లాడుతూ - ప్రజలు జాతీయ పొదుపు పథకాలలో పొదుపు చేస్తే డబ్బు ఎక్కడికి పోదని; ఆకర్షణలకు లొంగి ప్రైవేటు కంపెనీల వలలో పడి డబ్బును పోగొట్టుకో వద్దని సలహా ఇచ్చారు. సమావేశంలో జాతీయ పొదుపు పథకాల స్పెషల్ కాహకీల్దారు యు. ఆదిశేషయ్య కూడా పాల్గొన్నారు.

బస్సులు నడపండి

సూళ్లూరుపేట టౌన్‌కు తూర్పున గల పులికాట్ సరస్సులోని దీవులకు బస్సులు నడపాలని గ్రామస్తులు కోరుతున్నారు. కెసి ఎన్‌గుంట, కారికాత, వెనాడు, గోపాలరెడ్డి పాళాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా రవాణా సౌకర్యం లేదు. దినివల్ల కాలినడకనే సూళ్లూరు పేట చేరాల్సి వస్తున్నది. 10 వేల మందికి పైగా ప్రజలున్న గ్రామాలకు బస్సులను నడిపే విషయమై ఆర్టీసీ ఎందుకు శ్రద్ధ తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. జిల్లా కలెక్టర్ అయినా తమ గోడు వినిపించు కోవాలంటున్నారు ఈ గ్రామాల ప్రజలు.

కాళిదాస కళానికేతన్ వార్షికోత్సవం

గూడూరులోని శ్రీ కాళిదాస కళానికేతన్ 37వ వార్షికోత్సవం డివన్‌ఆర్ కమ్యూనిటి హాల్లో 28, 29 తేదీల్లో జరిగింది. ఈ సందర్భంగా లలిత, జానపద, సంగీత పోటీలను నిర్వహించారు. లలిత సంగీతంలో నెల్లూరుకు చెందిన సుబ్రహ్మణ్యం, జానపద సంగీతంలో బి. శ్రీనివాస్ (హైదరాబాద్), బండారు పద్మావతి, (రేబాల) విజేతలుగా నిలిచారు.



మద్యపాన ఉత్తర్వుకు నిరసనగా బంద్‌లో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న యూత్ కాంగ్రెస్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి

నడక పందెంలో రాపూరు బస్సులపై నత్తలదే పైచేయి!

రాపూరు ఆర్టీసి డిపో బస్సులకు, నత్తలకు పోటి పెడితే - నత్తలే నడకలో ఫస్ట్ ప్రైజ్ కొట్టేస్తాయి. నిదానమే ప్రధానం అనే సూక్తిని అక్షరాలా పాటిస్తూ, ఎక్స్‌ప్రెస్ బస్సులు సైతం 60 కిలోమీటర్ల దూరంలోని వెల్లూరు చేరను ముచ్చటగా మూడు గంటల సమయం తీసుకొంటున్నాయి. ఈ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కండలేరు డ్యాం, పొదలకూరులో మినహా మరెక్కడా ఆగవు. కాని కుంటి నడకతో, దెక్కొంటూ గంటలు గంటలు వృధా చేసేస్తాయి. ఆర్డినరీ బస్సుల గూర్చి ఇక చెప్పలేం. ఎప్పుడు బయలుదేరి ఎప్పటికి గమ్యం చేరుతాయో ఆ దేవుడికే ఎరుక. డిపోలో బస్సుల స్పీడ్‌ను 30 కిలోమీటర్లకి పరిమితం చేయడం వల్ల ఈ దుస్థితి దాపురించింది. డిపో పరిధిలోని బస్సులు ఇటీవల చాలా యాక్సిడెంట్లు చేసాయట. దానివల్ల లక్షలాది రూపాయలు నష్టపోవాల్సి వచ్చిందట. ఇంధనాన్ని తక్కువగా వాడి ఈ నష్టాన్ని పూడ్చాలని డిపో మేనేజర్ తపన. అందువల్ల స్పీడ్ కట్టిసి బస్సులను ఒంటెద్దు బండ్లలా నడుపు తున్నారు. ప్రమాదాలకు రోడ్లు, డ్రైవర్ల నిర్లక్ష్యం కారణాలు కావచ్చు. అందుకు ప్రయాణీకులను ఇట్లా ఇబ్బంది పెట్టడం తగదు.

దొంగకొళాయిలు తీయనిదే నీళ్లు ఇవ్వడం అసాధ్యం!

కావలి టౌన్‌లోని నీటి ఎద్దడిని నివారించేందుకు అక్రమ కొళాయిల తొలగింపు మినహా మరోదారి లేదని మునిసిపల్ కమిషనర్ ఎం. సుబ్బయ్య చేతులెత్తేశారు. కౌన్సిలర్లు ఒప్పుకొంటే వారం రోజుల్లో వాటిని తొలగించేస్తానన్నారు. 31 తేది జరిగిన సమావేశంలో మునిసిపల్ కొళాయిల్లో నీటి సరఫరా విషయమై రభస రేగింది. నీటి సరఫరా విభాగం ఇంజనీర్ ఉమా మహేశ్వర రావు వరుసగా ఐదవ మునిసిపల్ సమావేశానికి గైర్హాజర్ అవడం పట్ల పలువురు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. ఇంజనీర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర సభ్యుడు డి. శివ మాట్లాడుతూ తన వార్డులో నీళ్లు సక్రమంగా రావడం లేదని; అధికారులకు పద్ద ఎన్నిసార్లు మొత్తుకున్నా ప్రయోజనం వుండడం లేదని వాపోయారు. మునిసిపల్ ఆఫీసులో వ్యాన్లు కనపడ కుండా పోయిన విషయాన్ని కౌన్సిలర్ శ్రీహరి ప్రస్తావించారు. పట్టణంలో పారిశుధ్య పనులు చేపట్టక పోవడంతో కావలి చెత్తపూరుగా మారిందని కౌన్సిలర్లు చిట్టిబాబు, వెంకటేశ్వర్లు విమర్శించారు.వైస్ ఛైర్మన్ గ్రంధి యానాది శెట్టి - కోటి రూపాయల వ్యయంతో టౌన్ నడిబొడ్డులో టిటిడి కళ్యాణ మండపం నిర్మించినా, చేపల మార్కెట్ ప్రక్కనే ఉండడం వల్ల అది ప్రారంభం కాలేదన్నారు. ఆ మార్కెట్‌ను వెంటనే తరలించే విషయంలో శ్రద్ధ చూపించా లన్నారు. మునిసిపల్ నిధులను ప్రభుత్వం కరెంటు బిల్లుల పేర జమ చేసుకోవడం అన్యాయమని, దిని వల్ల ఒక్క పని కూడా చేయలేక పోతున్నారని కౌన్సిలర్ బల్వి చెప్పారు. సమావేశాన్ని ఛైర్ పర్సన్ శ్రీమతి నిహెచ్ దేవసేన అధ్యక్షించారు.

గూడూరు పాలిటెక్నిక్‌కు 4 లక్షలు మంజూరు!

గూడూరు పాలిటెక్నిక్ కళాశాల అదనపు గదుల నిర్మాణాన్ని 4 లక్షల రూపాయలతో చేపట్ట నున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ మంత్రి డాక్టర్ పరసారత్నం చెప్పారు. కళాశాల వార్షికోత్సవ సభలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారాయన. కళాశాల కాంపౌండ్ నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. సభలో శాసన సభ్యుడు బల్లి దుర్గాప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ వివి రమణ తదితరులు పాల్గొన్నారు.

చేతులెత్తేసిన కావలి కమిషనర్

వేటగాళ్ల తుపాకీ శబ్దం అటవీ అధికార్లకు వినపడదా?

రాపూరు మండలంలోని కొండ క్రింది గ్రామాలలోని అడవి జంతువులను వేటాడి చంపుతున్నారు. ఈ జంతువుల మాంసాన్ని మార్కెట్‌లో అమ్మడమే గాక, చర్మాలను మద్రాసుకు స్మగ్లింగ్ చేస్తున్నారు. పంగిలి, ఆకిలిపలస, పెంచలకోన అడవుల్లో రాత్రివేళల్లో వాటు తుపాకులు, డబుల్ బేరల్ గన్‌లతో ఈ వేట కొనసాగు తూంది. దుప్పి, కణిత, కుందేళ్లు, అడవి గొర్రెలు అన్యాయంగా వేటగాళ్ల బారిన పడిపోతున్నాయి. గతవారంలో ఏపూరు అడవుల్లో కొన్ని జింకలను కాల్చి చంపి వాటి చర్మాన్ని, కొమ్ములను రాపూరులో బహిరంగంగా అమ్మారు. అటవీ శాఖాధికారులు నెలసరి జీతాలు తీసుకోవడం మినహా ఒక్క వేటగాడ్ని కూడా పట్టుకోలేక పోయారు. ఈ మరికొన్ని రోజులు కొనసాగితే రాపూరు అడవుల్లోని మూగజీవాలు కనుమరుగై పోతాయి.

జిల్లావార్తలు

నేత్రదానం

గూడూరుకు చెందిన మునిసిపల్ కౌన్సిలర్ మాగుంట రంగారెడ్డి నేత్రాలను ఆయన కుమారులు మరణానంతరం దానం చేసారు. ఇటీవల రంగారెడ్డి చనిపోగా నేత్ర దాతల సంస్థ ఆయన నేత్రాలు సేకరించి చెన్నైలోని శంకర నేత్రాలయానికి పంపారు. గూడూరులో రంగారెడ్డిది 34వ నేత్రదానం. ఇక్కడి నేత్రదాతల సంస్థ ఉత్సాహంగా పనిచేస్తుండడం వల్ల, సంస్థ స్థాపించిన కొద్ది కాలంలోనే ఎక్కువ నేత్రాలను సేకరించ గలింది.

నెల్లూరు సంగతులు

4 పేజీ కొరవ

అధ్యక్షుడు తన అనుచరులతో సైకిల్ ర్యాలీ నిర్వహించి, పలు దుకాణాలను మూయించారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నాయకత్వంలో నల్ల చొక్కాలు ధరించిన కార్యకర్తలు కలెక్టర్ కార్యాలయం వద్ద హడావుడి సృష్టించారు. మరో యువజన నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నాయకత్వాన కార్యకర్తలు వైనాట్ కార్యాలయాన్ని చుట్టుముట్టి గడబిడ చేశారు. మునిసిపల్ ఛైర్మన్ ఆనం వివేకానందరెడ్డి కోర్టులను మూయించేశారు. ఇంటర్, ఇంటర్ పరీక్షలు మొదలైన తరువాత ఆర్టీసి వద్ద రాస్తారోకో చేస్తుండిన మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని, మరో 100 మంది కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. సాయంత్రం కాంగ్రెస్ కార్యకర్తలు గాంధిబొమ్మ సెంటర్‌లో సభ నిర్వహించారు. తెలుగు దేశం పార్టి వైఫల్యాలను డిసిసి అధ్యక్షుడు పట్రా ప్రకాశరావు సభలో వివరించారు.

నెల్లూరు అడ్వకేట్ క్లర్క్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం 27 తేది జరిగింది. నూతన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షునిగా జి. సత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా ఎం. బాబూరావు, కార్యదర్శిగా ఎ. సత్యనారాయణ రావు, కోశాధికారిగా డి. వెంకటరత్నం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎం. లక్ష్మినారాయణ, షేక్. అల్లాబక్షు, జె. నాగేశ్వరరావు, ఎ. బాబూరావు, టి. సుధాకర్‌ను ఎంపిక చేశారు.

కృష్ణశాస్త్రి శత జయంత్యుత్సవం

కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి శత జయంత్యుత్సవం 6 తేది టౌన్‌హాల్‌లో జరుగుతుంది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ సంస్థ ఏర్పాటు చేసే ఈకార్యక్రమంలో సినీ రచయితలు వెన్నెలకంటి రాజేశ్వర ప్రసాద్, సిరివెన్నెల సీతారామశాస్త్రి, డాక్టర్ ఆవంత్స సోమసుందర్, బాలజ్యోతి మాస పత్రిక ఎడిటర్ శశికాంత్ శాతకర్ణి ప్రసంగిస్తారు. ఇదే రోజు ఉదయం గాంధి బొమ్మ వద్ద గల మహిళా గ్రంధాలయంలో కృష్ణశాస్త్రి రచనలపై వెన్నెలకంటి అధ్యక్షతన సదస్సు జరుగుతుంది. కార్యక్రమానికి సాహితీ అభిమానులను తరలి రమ్మంటున్నారు సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఎన్.వి. ఆఫర్స్.

పంచాఙ్గమ్

ఉగాది

తేదీ8 శనివారం ఉగాది ఈశ్వర సంవత్స ప్రారంభం.

శుక్ల పాడ్యమి జరుగుచున్నది.

తేదీ 5 శనివారం శనిత్రయోదశి.

ఏప్రిల్ తిథులు

పాల్గుణ బహుళ

తే 5 శని త్రయోదశి రా.గ. 9.15వ
తే 6 ఆది చతుర్దశి రా.గ. 6.56వ
తే 7 సోమ అమావాస్య సా.గ .4.43వ

చైత్రశుద్ధ

తేది మంగళ పాడ్యమి ప.గ. 2.50వ
తే 9 బుధ విదియ ప.గ. 1.36 వ
తే10 గురు తదియ ప.గ. 2.15వ
తే11 శుక్ర చతుర్థి ప.గ. 1.00వ

స్వయంపాకుల శ్రీనివాసులు, ఎం.ఎ.,

జనవాణి

3 పేజీ కొరవ

బహుళ లీడేమో. గోపాలరెడ్డి గారికి ఇందులో మినహాయింపు లేదు. 1988-89 ప్రాంతంలో సోమశిలకు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వచ్చి గోపాలరెడ్డిని సన్మానించారు. ఆ సన్మానానికి బె.గో.రె. అంగీకరించినందుకు జమీన్‌రైతు సుతిమెత్తగా తన ధోరణిలో చీవాట్లు పెట్టింది. పత్రికల్లో ప్రతికూల వ్యాఖ్యలు కరువై పోతున్న రోజుల్లో నిజాన్ని నిర్భయంగా వ్రాయబట్టి ఈ పత్రిక మన గలుగుతున్నది.

విశాఖపట్నం ఎం.రామ్మూర్తి

పీపుల్స్‌వార్ కాదు పీపుల్స్ పాలి క్లినిక్!

మార్చి 21 తేది జమీన్‌రైతు సంచిక నెల్లూరు సంగతుల శీర్షికలో బెజవాడ గోపాలరెడ్డి సంతాప సభ వార్తా విశేషాలు ప్రచురించారు. ఆ వార్తలో నేను గోపాలరెడ్డి గారు పీపుల్స్‌వార్ గ్రూపు వారికి విరాళాలు ఇచ్చారని చెప్పినట్లు వచ్చింది. కాని, నెల్లూరులోని పీపుల్స్ పాలి క్లినిక్‌కు విరాళాలిచ్చారని మాత్రమే నేను చెప్పాను. పొరపాటుగా వచ్చిన వార్త వల్ల ప్రజల్లో నా మీద దురభిప్రాయం గలిగే అవకాశం ఉంది.

నెల్లూరు పి. అనంతరామయ్య

జమీన్‌రైతు గోపాలరెడ్డిని ఎంతో ప్రోత్సహించింది

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి జీవితాన్ని మార్చి 23 తేది జమీన్‌రైతు సంచిక సణుగుడు శీర్షికలో చక్కగా సమీక్షించారు. నాకు ప్రస్తుతం 75 ఏళ్లు. 1937లో జరిగిన ఎన్నికలు నాకు బాగా గుర్తు. జస్టిస్ పార్టీలో తిరుగులేని నాయకుడిగా ఉండిన బెజవాడ రామచంద్రారెడ్డిని విమర్శించే దమ్ము ఎవరికీ ఉండేది కాదు. కాని, రామచంద్రారెడ్డికి సంబంధించిన పలు విషయాలను స్వర్గీయ వెంకట్రామా నాయుడు గారు జమీన్‌రైతులో దూదేకినట్లు ఏకి గోపాలరెడ్డి మెడలో విజయమాల పడేలా చేశారు. ఆ ఎన్నికల్లో తన గెలుపు ఏకైక కారణం జమీన్‌రైతేనని గోపాలరెడ్డి కూడా గర్వంగా ప్రకటించారు. ఆ తర్వాత సైతం గోపాలరెడ్డిని జమీన్‌రైతు ఎంతో ప్రోత్సహించింది.

హైదరాబాద్ వెంగళరెడ్డి

మూగ, చెవిటి వారికి రైల్వే రాయితీలు పెంచాలి

ప్రస్తుత రైల్వే నిబంధనల ప్రకారం, పూర్తి మూగ - చెవుడు కలిగిన వికలాంగులకు రైల్వే ప్రయాణానికి 50 శాతం మాత్రమే రాయితీ లభిస్తుంది. వీరికి తోడుగా ప్రయాణం చేసిన వ్యక్తికి ఏవిధమైన రాయితీని ప్రభుత్వం ఇవ్వడం లేదు. కాని గ్రుడ్డివారికి, ఎముకల రుగ్మతతో బాధపడుతున్న వికలాంగులకు వారి వెంట వుండేవారికి మాత్రం ప్రయాణ ఛార్జీలో 75 శాతం రాయితీ ఇస్తున్నారు. వినడానికి, మాట్లాడడానికి నోచుకోని మూగ, చెవుడు వికలాంగులకు కూడా రైల్వేలో 75 శాతం రాయితీ మానవతా దృక్పథంతో ఇచ్చి ఆదుకోవాలి.

కావలి కె. సుజాత వాగరాబారావు

వారఫలాలు

తేది 5.4.97 నుండి 11.4.97 వరకు మీనంలో బుధుడు; సింహంలో వక్రకుజుడు; కన్యలో రాహువు; మకరంలో గురువు; మీనంలో రవి, శుక్ర, భౌమ, కేతువులు; కుంభ, మీన, మేష వృషభాలలో చంద్రుడు.

మేషం



(అశ్వని, భరణి, కృత్తిక 1పాదం)

ఈ రాశి వారికి ఖర్చులు బాగా పెరుగుతాయి. బంధువర్గం నుండి బాధాకర వార్తలు వింటారు. వృత్తి, ఉద్యోగులకు ఆదాయం బాగున్నా అనుకొని ఖర్చులు ఏర్పడగలవు. పిల్లల విద్యా, వివాహ ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తాయి. వారాంతంలో ఆరోగ్యం సరిగా ఉండదు. ఇరుగు పొరుగు వారివల్ల గాని అధికారుల వల్లగాని మాటలు పడవలసి వస్తుంది. పెట్టుబడులకు అనుకూలం గాదు.

వృషభం



(కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2పాదాలు)

వృత్తి, వ్యాపార జీవనం కలవారికి ఆశించిన ఆదాయం కలుగక పోవచ్చు. స్థిరాస్తుల వ్యవహారాలు పరిష్కరించుకొనే అవకాశం లభిస్తుంది. బంధువులు, మిత్రులతో సత్కాలక్షేపణ, కుటుంబ సభ్యులతో అభిప్రాయ భేదాలు కలుగును. సాహితీ, సాంస్కృతిక కార్యాలందు పాల్గొనుట, కీర్తి ప్రతిష్ఠలు బాగుండును. పిల్లలకు కొద్దిపాటి అనారోగ్యం కలుగును.

మిథునం



(మృగశిర 3,4పాదాలు; ఆర్ద్ర; పునర్వసు 1,2,3పాదాలు)

ఈ రాశి వారికి ఆదాయం బాగుంటుంది. ప్రభుత్వపరమైన పనులు నిదానంగా జరుగుతాయి. భార్యకు, సోదరులకు ఆరోగ్యం సరిగాఉండక పోవచ్చును. దూర ప్రయాణాలు, సాంస్కృతిక కార్యము లందు పాల్గొనుట జరుగును. పిల్లల విద్యావృద్ధి నూతన వ్యక్తులతో పరిచయం కలుగును. వారాంతంలో వస్తు నష్టం కలుగును.

కర్కాటకం



(పునర్వసు 4వ పాదం; పుష్య; ఆశ్లేషలు)

వార ప్రారంభంలో స్వల్ప అనారోగ్యం, బంధువుల రాకపోకలుండును. మాట పరుషత్వం వల్ల తగాదాలు చిక్కులు కలుగ వచ్చును. వ్యాపార, వృత్తి, వ్యవసాయ జీవనం కలవారికి ఆదాయం బాగుంటుంది. సత్కాలక్షేపణ, గౌరవ మర్యాదలు పొందుతారు. నూతన వ్యాపార భాగస్వామ్యం, ఏజన్సీల వంటివి ప్రయత్నిస్తే లాభిస్తాయి. ఇండ్లు, భూముల వల్ల రావలసిన ఆదాయం కొంత లభిస్తుంది.

సింహం



(మఖ; పుబ్బ; ఉత్తర 1పాదం)

కోపం, పట్టుదలతో సమస్యలు తెచ్చుకొనవద్దు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, పని పత్తిడి ఎక్కువగా ఉంటుంది. పిల్లల విద్యా, వివాహ ప్రయత్నాలకు ఆటంకాలు కలుగవచ్చు. వృత్తి, వ్యాపార జీవనం కలవారికి ఆదాయం బాగుంటుంది. అధికారుల వ్యతిరేకత కార్యనిర్వహణకు ఆటంకాలు కలుగవచ్చు. తండ్రి, సోదర వర్గం వారికి అనారోగ్యం కలుగవచ్చు.

కన్య



(ఉత్తర 2,3,4 పాదాలు; హస్త; చిత్ర 1,2పాదాలు)

వారాంతంలో బలహీనత, అనారోగ్యం కలుగవచ్చు. ప్రతిపనిలో ఆందోళన సందేహాలు కలుగుతాయి. మిత్రుల అధికారుల తోడ్పాటుతో పనులు సాధించు కొంటారు. కుటుంబ సౌఖ్యం, మంచి వార్తలు వినడం

స్వయంపాకుల శ్రీనివాసులు, ఎం.ఎ.

జరుగుతుంది. నూతన వస్తువులు కొనడం, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం జరుగుతుంది. ఆదాయం బాగుంటుంది.

తుల



(చిత్ర 3,4 పాదాలు; స్వాతి; విశాఖ 1,2,3 పాదాలు)

వారాంతంలో వస్తు, ధన నష్టం కలుగవచ్చును. ఆరోగ్యం కూడా సరిగా ఉండదు. దూరపు బంధువుల అనారోగ్య వార్తలు వినవలసి రావచ్చును. వృత్తి, వ్యాపార, వ్యవసాయ మూలక రాబడి సంతృప్తికరంగా ఉంటుంది. ప్రభుత్వ సంబంధమగు పనులు వాయిదా పడగలవు. రావలసిన బాకీలు సంపాదించే ప్రయత్నాలు ఎదురు తిరుగుతాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది.

వృశ్చికం



(విశాఖ 4పాదం; అనూరాధ; జ్యేష్ఠ)

వృత్తి, వ్యవసాయ, ఉద్యోగులకు ఆదాయం బాగుంటుంది. వ్యాపారస్తులకు మాత్రం సంతృప్తికరం. ఆదాయం ముండదు. పెట్టుబడులకు అనువైన సమయం కాదు. స్వంత పనులలో మిత్రాధికారుల తోడ్పాటు వుంటుంది. కుటుంబ శుభకార్య ప్రయత్నాలు సత్ఫలితాల నివ్వగలవు. బాకీలు వసూలు ప్రయత్నాలు చేయవచ్చును. శుభ కార్యాలలో పాల్గొంటారు.

ధనుస్సు



(మూల; పూర్వాషాఢ; ఉత్తరాషాఢ 1పాదం)

స్థిరాస్తుల లావాదేవీలు లాభకరంగా ఉండగలవు. అన్ని రంగాలలో జీవనం కలవారికి ఆదాయం బాగుంటుంది. క్రొత్త వస్తువులు కొనడం, కుటుంబ సౌఖ్యం, బంధుమిత్రులతో సత్కాలక్షేపణ ఉంటుంది. కీర్తి ప్రతిష్ఠలు బాగుంటాయి. వారాంతంలో కొద్దిపాటి అనారోగ్యం ఉంటుంది. కుటుంబ శుభకార్య ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

మకరం



(ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు; శ్రవణ; ధనిష్ఠ 1,2పాదాలు)

ఈ రాశి వారికి ఆదాయం బాగుంటుంది. ఆస్తి, ప్రాపేట్ల సంబంధమగు వ్యవహారాలు కలుగవచ్చు. మంచి వార్తలు వింటారు. వారాంతంలో వస్తు, ధన నష్టం కలుగ వచ్చును. సాంస్కృతిక కార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. మాట, హామీలు, ఋణాలు ఇవ్వడం మంచిది కాదు. చేస్తున్న పనుల పలన గుర్తింపు గౌరవం వుంటుంది.

కుంభం



(ధనిష్ఠ 3,4పాదాలు; శతభిష; పూర్వాభాద్ర 1,2,3 పాదాలు)

కుటుంబ ఆర్థిక సమస్యలు, బయట వ్యవహారాల వల్ల చిక్కులు బాధ వుంటుంది. వ్యాపారస్తులకు, వృత్తి, ఉద్యోగులకు సామాన్య ఆదాయం వుంటుంది. వ్యాజ్యాలు ఋణాల వసూలు వాయిదావేసి కొనడం మంచిది. అనుకోని ప్రయాణాలు గాని, సాంస్కృతిక కార్యాలందు పాల్గొనడంగాని జరుగుతుంది. కటువుగా మాట్లాడడం మంచిది కాదు.

మీనం



(పూర్వాభాద్ర 4వపాదం; ఉత్తరాభాద్ర; రేవతి)

జన్మ శని గోచార కారణంగా తలచిన పనులు నిదానంగా సాగుతాయి. అన్ని రంగాల వారికి ఆదాయం బాగుంటుంది. వారాంతంలో ఖర్చులు అనవసరంగా పెట్టడంగాని, వస్తు నష్టంగాని ఉంటుంది. వారం మధ్యలో పిల్లలకు ఆరోగ్యలోపం వుంటుంది. ఉద్యోగులు శ్రమ పడతారు గాని గుర్తింపు లేకపోవచ్చు. శుభ కార్యాలలో పాల్గొంటారు. బాకీలు వసూలు జరగక పోవచ్చును.

ఏభైఏళ్ల క్రితం

3వ పేజీ కొరవ

ఈయనకు సర్దారి గిట్టదు. మాంసాదులు పనికి రావు. కోడిగ్రుడ్లు,పంద్లు, పాలూ సేవిస్తాడు మొండివాడు. జగమొండి. నిర్భయుడు. నిర్లక్ష్యం మూర్తిగట్టిన మనిషి. మహాగొప్ప రణ పెంకె. ఇంతా ఏదో ఒక నాటకం రాస్తున్నాడట. ఈ లోక నాటకంలో ఆయనకు తెలియనిది ఏది లేదు.

ఉదయగిరి

రామ రామ! ఈ కాలూకాలో పరిస్థితులు విషమించి పోతున్నవి. ప్రజానీకం క్రమేణా లేచిపోతున్నది కలెక్టరు ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోతే అన్యాయం చేసిన వారవుతారు.

- వరసింహం

కాజోల్ సౌందర్య రహస్యం - బెల్లం!

బాజీగర్ ఫేమ్ కాజోల్ తన సౌందర్యానికి కారణమైన రహస్యాన్ని వెల్లడించే సరికి పలువురి నోట మాట రాలేదు. జీడిపప్పు, కిస్మిస్, బాదం పళ్లు తినడం వల్లే తన అందం మరింత మెరుగు పడినట్లు చెప్పిందామె. షూటింగ్స్‌కి ఒక బాటిల్‌లో బెల్లం తెచ్చుకొని తినే అలవాటును చూసి, తన ప్రక్కన నటించే హీరోలు నొచ్చుకున్నా కాజోల్‌లో మాత్రం మార్పేలేదు.

ఆస్కార్ అవార్డులు

ఈసారి ఆస్కార్ అవార్డులు ఊహకు అందని చిత్రాలకు, నటినటులకు, సాంకేతిక నిపుణులకు వచ్చాయి. 'ది ఇంగ్లీష్ పేషెంట్' చిత్రం 9 అవార్డులను గెల్చుకొని సంచలనాన్ని సృష్టించింది. ఉత్తమ చిత్రం, దర్శకుడు, సహాయ నటి అవార్డులు ఈ చిత్రానికే రావడం విశేషం. ఉత్తమ నటుడుగా షైక్ చిత్రం హీరో జెఫ్రిరష్‌కు వచ్చింది. ఫార్గో చిత్రం పోలీస్ అధికారినిగా నటించిన ఫ్రాన్సిస్ మెక్ డోల్మాండ్‌కు ఉత్తమ నటి అవార్డు లభించింది. 1988 తరువాత ఒకే చిత్రానికి 9 అవార్డులు రావడం ఇదే మొదటిసారి. అప్పట్లో 'ది లాస్ట్ ఎంపరర్'కి ఈ విధంగా అవార్డులొచ్చాయి. అగ్రనటుడు టామ్ క్రూయిస్, డయానా సేటన్ వంటి వాళ్లకు ఆస్కార్ నామినేషన్ లభించింది కాని అవార్డుకు ఎన్నిక కాలేదు. టామ్ 'క్రూయిస్, డయాన్ సేటన్, బాకవ్ వంటి నల్గురయిదుగురు మినహా అవార్డుకు నామినేషన్ చేయబడిన మిగిలిన వారంతా జనానికి కొత్తవారే! ఇందులో 14 మంది మొదటిసారిగా అవార్డు పొందారు.

దెయ్యం పాత్రలో కమల్‌హాసన్!

తన సినిమాలో ఏదో ఒక ప్రత్యేకత ఉండేలా చిత్రాన్ని రూపొందించడం కమల్‌హాసన్ హాబీ.

తాజాగా ఆయన తీస్తున్న తమిళ చిత్రం 'జాపనీల్ కల్యాణ్ రామన్'లో దెయ్యం పాత్రం పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఇంగ్లీషులోని 'ఘోస్ట్' చిత్రం ఆధారం. తమిళ చిత్ర పరిశ్రమలో ఇప్పటి వరకు ఎప్పుడూ వెచ్చించ నంత బడ్జెట్‌తో ఈ చిత్రం తయారవు తుంది.



అన్నమయ్య సెట్‌లో మోహన్‌బాబుకి సూచనలిస్తున్న డైరక్టర్ రాఘవేంద్ర రావు.

అక్కినేనికి వాస్తు పిచ్చి!

అక్కినేని నాగేశ్వర రావు తాను నాస్తికుడినని చెప్పు కొంటుంటారు. కాని ఇటీవల ఆయన కుమారుడు హీరో నాగార్జున చెప్పిన మాటలను బట్టి అక్కినేని కూడా ఆస్తికుడేనని నమ్మాల్సి వస్తుంది. నాగార్జున ఇటీవల తనకు దైవం మీద నమ్మక ముందని చెబుతూ 'మా నాన్న గారిలో కూడా ఏదో ఒక మూల దైవం మీద విశ్వాసం ఉందేమోనన్న అనుమానం నాలో ఉందని' ప్రకటించారు. ఈ విషయం హైదరాబాద్‌లో చర్చనీయాంశ మైంది. పాత రోజుల్లో అక్కినేని నాస్తికుడే కావచ్చు. ఆయన కట్టిన అన్నపూర్ణ స్టూడియో పూర్తి వాస్తు శాస్త్ర ప్రకారంగా ఉంది. తరచు ఆయన వాస్తు, శాస్త్రవేత్తలు వివి రావు, బివిన్ రెడ్డిలను పిలిపించు కోవడం వెనుక మారిన అక్కినేని ధోరణి వెల్లడౌతుంది.

రజనీకాంత్ ఎత్తుగడ!

రజనీకాంత్ హీరోగా నటిస్తూ, స్వయంగా నిర్మిస్తున్న 'అరుణాచలం' చిత్రానికి 4 కోట్ల వరకు ఖర్చు పెడుతున్నట్లు వినికిడి. ఈ చిత్రంతో 19 కోట్ల వ్యాపారం చేయాలని రజనీకాంత్ లక్ష్యమట. మామూలుగా ఏ సినిమా నయినా జిల్లాల వారీగా, ప్రాంతాల వారీగా బయ్యర్స్‌కు అమ్ముతారు. కాని అరుణాచలం చిత్రాన్ని డైరక్ట్‌గా థియేటర్లకే అమ్మబోతున్నారు. దీనికోసం తమిళనాడులో 120 థియేటర్లను 5 లక్షల రేటుతో ఫిక్స్ చేశారు. ఈ విధంగా అమ్మితే 6 కోట్లు వస్తుంది. తరువాత బయ్యర్‌కు అమ్ముతారు. దీని ద్వారా 3 కోట్లు వస్తాయి. ఆడియో హక్కుల ద్వారా రెండు కోట్లు.తెలుగు కన్నడ, మళయాళ, హిందీ భాషల్లో డబ్బింగ్ హక్కులు అమ్మడం ద్వారా 8 కోట్లు సంపాదించాలని పథకం రచించి ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. రజనీ ఆశలు ఫలిస్తాయో లేదో వేచిచూడాలి.

మంచికథలు రావాలంటే....

సినిమాలో మా రోల్ పాడవెంత? ఎన్ని డ్రెస్సులున్నాయి? ఎన్ని పాటలున్నాయి? అనే ప్రశ్నలు వేయకుండా శ్రీకాంత్, చక్రవర్తిలు

మద్రాసు సినిమా వార్తలు

'ఎగిరే పావురమా' చిత్రంలో చేశారు. ఇటువంటి మనస్తత్వం ఉన్న హీరో లుంటే తెలుగులో మంచి కథలు పుట్టుకొచ్చి, చక్కనైన సినిమా లొస్తాయని దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి భాష్యం చెప్పారు. మార్చి 20 తేది హైదరాబాద్‌లో జరిగిన 'ఎగిరే పావురమా' ప్లాటినమ్ డిస్క్ ఫంక్షన్‌లో ఈ మాట చెప్పా రాయన. రెండు చిత్రాలు ఫ్లాప్ అయ్యాక కృష్ణారెడ్డికి తెలివి వచ్చినట్లుంది?

ఈ సినిమా చూడడం సాహసమే!

సినీ పరిశ్రమ, ప్రేక్షకులంటే మరి లెక్క లేని ధోరణిలో కృష్ణ హీరోగా 'అదిరింది గురూ' చిత్రాన్ని తీసిన నిర్మాతలు మధు - రజనీల ధైర్యాన్ని ఏ విధంగా అభివర్ణించాలో అర్థం కావడం లేదు. ఈ చిత్రంలో కథ లేదు, సరైన కథనం అంతకంటే లేదు; హీరో, హీరోయిన్లు, ఇతర నటులు నటించడానికి అవకాశమే ఇవ్వకుండా రీళ్లు చుట్టిసిన దర్శకుడు సాగర్ ప్రతిభ బహా పరాక్! ఈ చిత్రంలో హీరో పాత్ర పేరేమిటో చివరి వరకు ప్రేక్షకులకు తెలియదు. కథ సాగే గ్రామంలో పోలీస్ స్టేషనే కనపడదు. కాని ఆ గ్రామంలో విలన్‌ను ఎదుర్కొనేందుకు ఒక కానిస్టేబిల్ వచ్చి కాపురం ఎందుకు పెడతాడో అర్థం కాదు. హెడ్‌కానిస్టేబిల్ భార్య మధ్యలోపిచ్చిపట్టి ఎటో వెళ్లి పోతుంది; చివరి సీనులో విఠలాచార్య సినిమాల్లోలా టక్కున ప్రత్యక్షమవు తుంది. 55 ఏళ్లు పైబడ్డా హుషారుగా నటించి, నర్తించే హీరోకృష్ణ ఈ చిత్రంలో ఏ సన్నివేశంలోనూ హుషారుగా కనిపించడు. సినిమాకు వెళ్లిన ప్రేక్షకుల మాడు అదిరిపోయేలా చేసే చిత్రం....

అదిరింది గురూ!

★

పరామర్శ

★

అల్లూరు రహీం

అదిరింది గురూ.

ఎం.ఎస్. నారాయణ వ్రాసిన కథలో గురూ (కృష్ణ), తన పెంపుడు తండ్రి పురుషోత్తమ రావును జైలుపాలు చేసిన అన్నారం (కాస్టూమ్‌కృష్ణ) పనిపట్టను ముద్దాపురం వస్తాడు. అంత క్రూరుడైన విలన్ - హీరో వచ్చి, తన పొలం ఆక్రమించి గెస్ట్‌హౌస్ కట్టుకొంటే చూస్తూ ఊరుకొంటాడు. అటుచూడ వద్దని దర్శకుడు అతడికి చెప్పాడేమో తెలియదు. హీరోకు తోడుగా పాటలు పాడుకొనేందుకు గౌరి (రంజిత) గెస్ట్‌హౌస్‌కు వచ్చి చేరుతుంది. తరువాత వచ్చిన అన్నారం కుమార్తె చిట్టి (ప్రేమ) కూడా గురూలోని మంచి తనాన్ని చూసి మనసు పారేసు కొంటుంది. ఇటువంటి కథను తెలుగు ప్రేక్షకులు ఎన్ని సినిమాల్లో చూసి ఉంటారో ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. కథలో సత్తా లేకపోవడం వల్ల ఎల్.బి. శ్రీరాం మాటలు కూడా నీరసంగా ఉన్నాయి. కోటి సంగీతంలో భువనచంద్ర వ్రాసిన బొమ్మా - బొమ్మా, గిల్లి గిల్లి గిచ్చుకోండి పాటలు పరవాలేదు. ఈ సినిమాను చూడడం ప్రేక్షకులకు సాహసమే. తెగించి వెళ్లేవారికి నా సానుభూతి.

ది నెల్లూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్

16/1245, గాంధినగర్, నెల్లూరు తేది 29.3.97

వేలం ప్రకటన

ఈ బ్యాంకుకు సంబందించిన ఈ క్రింద తెలియ జేయబడిన పాతవస్తువులు 19.4.97 తేది శనివారం ఉదయం 11 గంటలకు బ్యాంకు ఆవరణమున బహిరంగ వేలం ద్వారా విక్రయించ బడును.

1. వజ్రా ఎలక్ట్రానిక్ ఇన్‌వర్టర్.....1
2. బ్యాటరీలు.....2
3. పాత టేకు కౌంటరు.....1
4. పాత ఇనుప గేటు.....1
5. 0.5 HP సుగుణ మోటారు మరియు పంపు.....1

వస్తువులను బ్యాంకు పనివేళ లందు పరిశీలించు కొనవచ్చును. వేలం షరత్తులను బ్యాంకు కార్యదర్శిగారి నుండి తెలిసికొన వచ్చును.

యస్.కె. రాజేశ్వర రావు — కె.సి.యస్. అమరనాథ్

డిప్యూటి రిజిస్ట్రారు/కార్యదర్శి — అధ్యక్షులు

ఉత్తమ IOL సర్జరీ ఫలితాలకు ప్రత్యేక సౌకర్యం

* అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచిన **West Germany** టెక్నాలజీతో నిర్మించిన **Zeiss Operating Microscope**తో కంటి ఆపరేషన్లు చేయబడును, రాష్ట్రంలోనే ప్రప్రథమ ఆవిష్కరణ.
* IOL సర్జరీ (కంటి శుక్లము తీసి కంటిలోనే అద్దము అమర్చుట) వంటి ఆపరేషన్లకు వరప్రసాదం.
* **L.V.** ప్రసాద్ **Eye** ఇన్‌స్టిట్యూట్, హైదరాబాదు, C.M.C. EYE HOSPITAL, VELLORE గడించిన అనుభవం
* అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ సౌకర్యము Round the clock Eye Care.
* Contact Lens సౌకర్యము (అద్దములు లేకుండా కంటిగుడ్డుపై అద్దము అమర్చుట.)

గమనిక
* స్పెషలిస్టు డాక్టర్లకు కన్సల్టేషన్ రూములు కలవు.
* ఆసుపత్రి ప్రాంగణములోని మెడికల్ షాపు లీజుకు ఇవ్వబడును.

Your Eyes Our Care

Dr. SK. మొహీబుల్లా M.S.

కంటివైద్య విభుడు, ముద్రాసు బస్టాండ్ దగ్గర, నెల్లూరు-3, ఫోన్: 28106



నారా చంద్రబాబునాయుడు
ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్.

హైదరాబాదు,
తేది: 27.03.97.

బాధతో తీసుకొన్న నిర్ణయం.. అర్థంచేసుకుని సహకరించండి

సోదర సోదరీమణులారా,

మహత్తర ఆశయంతో, మహిళోద్యమ స్ఫూర్తితో *16.1.95* నుండి రాష్ట్రమంతటా సంపూర్ణమద్యపాన నిషేధాన్ని అమలు పరచడం జరిగింది. మహిళల ఆవేదనను అర్థం చేసుకొని, ఒక వినూత్న సమాజం ఉద్భవిస్తుందన్న ఆశతో, ఆశయంతో ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. కాలక్రమంలో ఈ ఆశలన్నీ అడియాశలుగా మిగిలిపోయి, ఆశించిన సామాజిక ప్రయోజనం చేకూరకపోగా దుష్పలితాలు ఆరంభం కావడంతో అత్యంతవేదనా భరిత హృదయంతో రాష్ట్రప్రభుత్వం ఈ రోజు మద్యనిషేధ చట్టాన్ని పాక్షికంగా సడలించాలని సంకల్పించింది.

ఎవరికోసం ఈ నిర్ణయం తీసుకొన్నాం..ఒక్కసారి అందరూ అర్థంచేసుకోండి! మద్యపాన నిషేధం వల్ల త్రాగుబోతుల ఆరోగ్యం బాగుపడుతుందని, పేద ప్రజల్లో పొదుపు పెంపొందుతుందని, సమాజంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని, పేద కుటుంబాలు, మహిళలు పతనంకాకుండా పచ్చగావుండాలని, రాష్ట్రాభివృద్ధి పరుగులు తీస్తుందని అనుకున్నాం.

కాని ఆశించిన సామాజిక ప్రయోజనాలు చేకూరలేదు. జనాల్లో నేరప్రవృత్తి పెరిగింది. కల్తీకల్లు, కల్తీమద్యం, మత్తుమందులు వాడడం పెరిగిపోవడం వలన చాలామంది ఆరోగ్యం చెడిపోయింది. వీటివల్ల ఇప్పటికే చాలా మంది చనిపోయారు. మాఫియా గ్యాంగ్స్ విపరీతంగా పెరిగాయి. వ్యక్తులనైతిక విలువలు తగ్గి సులభ ధనార్జన కోసం అలవాటు పడ్డారు. కొందరు అమాయకులను, నిరుద్యోగులను, యువకులను, మహిళల్ని సహితం స్మగ్లింగ్ కార్యకలాపాల్లో చేర్చి వారినికూడా నేరస్తులుగా మార్చివేసారు. సరిహద్దు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా బార్డర్ల నుంచి మద్యం అనేక మార్గాల ద్వారా రవాణా అవుతుంది. ఉద్యమాన్ని ఆరంభించిన నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు అనుకొన్నంత స్థాయిలో నిషేధం తర్వాత కలిసి రాలేదు. కుటుంబస్థాయిలో కూడా మద్యం త్రాగడాన్ని అరికట్టలేక పోయారు. గ్రామాల్లో సారాబట్టీలు వెలిసినా, అమ్మకాలు జరిగినా ఎంతోమంది మౌనపాత్ర వహించారు. నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలుచేయడానికి డి. ఐ. జి., ఎడిషనల్ ఎస్.పి. వంటి ఉన్నత పదవులలో చాలా అనుభవంగల సీనియర్ అధికార్లను నియమించాము. స్పెషల్ ఇంటెలిజెన్స్ టీమ్స్ని, ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసాము. సరిహద్దుల్లో స్మగ్లింగ్ నిరోధానికి సహకరించవలసిందిగా, పొరుగు రాష్ట్ర ప్రభుత్వాలను పదేపదే కోరడం జరిగింది. ప్రజల వద్దకు పాలన సందర్భంగా అనేక గ్రామాల్లో - నేనే ప్రజల్ని చైతన్య పరిచినా, మద్యంను అదుపు చేయలేక పోయారు.

భారతదేశమంతటా మద్యనిషేధాన్ని అమలు పరచాల్సిందిగా యునైటెడ్ ఫ్రంట్ స్టీరింగ్ కమిటీ సమావేశాల్లోను, ముఖ్యమంత్రుల సమావేశాల్లోను అనేక సార్లు ప్రస్తావించగా ఎవరినుండి కూడా సరైన స్పందన లభించలేదు. రాష్ట్రంలోనే కాదు అనేక ప్రపంచ దేశాలలో కూడా మద్యనిషేధం విఫలమైంది. ప్రాచీన చైనాలో, పూర్వపు జపాన్ ఫ్యూడల్ వ్యవస్థలో, ఐస్లాండ్లో, నార్వేలో, స్వీడన్లో, రష్యాలో, కెనడాలో, అమెరికాలో మద్యనిషేధం పూర్తిగా విఫలమై నిషేధాన్ని ఎత్తివేయడం జరిగింది.

విధిలేని పరిస్థితుల్లో కొన్ని నిర్ణయాలు కాలానుగుణంగా తీసుకోకతప్పదు. మద్యనిషేధం కూడా పకడ్బందీగా అమలుపరచాలని, చిత్తశుద్ధితో కృషిచేశాము. కానీ ఆశయాలకు విరుద్ధంగా జరిగిన విపత్కర పరిణామాలన్నీ మనసును బాధపెట్టి, ఈ నిర్ణయం తీసుకోవడానికి ప్రేరేపించింది.

ఈ నిర్ణయం ఎవరి కోసం ?

బాధాతప్తహృదయంతో తీసుకొన్న ఈ నిర్ణయం ప్రభుత్వ రాబడి కోసం కాదు. నీరుగారిపోతున్న మద్యనిషేధం వలన మరిన్ని దుష్పలితాలు కలగకుండా రాష్ట్రాన్ని రక్షించడం కోసం తీసుకొన్న నిర్ణయం. అడ్డదారులు త్రొక్కి, అక్రమార్జన చేయాలనుకొనేవారి ఆశయాలకు సమాధికడుతూ తీసుకొన్న నిర్ణయం.

పేదలను కృంగదీసే 'సారా' పై నిషేధం యధాతధంగా కొనసాగుతుంది. చీప్ లిక్కర్ను అనుమతించబోము. సారాను తుదముట్టించడానికి ప్రత్యేక దృష్టిని పెడతాము. మద్యం అందుబాటును కూడా క్రమబద్ధీకరిస్తాము. బహిరంగ ప్రదేశాలలో త్రాగడం నిషిద్ధం. బార్లకు లైసెన్సులు ఇవ్వడం జరగదు. పరిమితమైన సంఖ్యలో అమ్మకపు కేంద్రాలు ఏర్పాటు చేస్తాము. పేద ప్రజలకు ఎలాంటి నష్టం కలగదు.

ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా అర్థంచేసుకుని, సహకరిస్తారని ఆశిస్తూ . . .

మీ,

(నారా చంద్రబాబునాయుడు)

TOUCHSTONE

Edited, Printed and Published by N. Balendra Prasad at Zaminryot Press, Offset Printing at Aruna Graphics, Nellore